ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 45

ఆదివారం 14 జూలై 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## కుర్రాళ్లు కదంతొక్కారు!

అర్ధసెంచరీలతో మెరిసిన జైస్వాల్, గిల్

జింబాబ్వేపై భారత్ ఘన విజయం

3-1తో టీ20 సిరీస్ కైవసం

నేడు ఇరు జట్ల మధ్య ఐదో టీ20



.. వివరాలు 7లో



## ఫీజు రీయింబర్స్‌మెంట్..

# వన్‌టైమ్ సెటిల్‌మెంట్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కాలేజీలకు సీఎం ప్రతిపాదన

ఇక నుంచి సకాలంలో చెల్లింపులు చేస్తాం

తెలంగాణ ఏర్పాటుకు నిరుద్యోగమే ప్రధాన కారణం

దీన్ని పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధులు విఫలమైనట్లే

ఏ పరీక్షలూ రాయనివాళ్లే వాయిదా దీక్షలు చేస్తున్నారు

జాబ్ క్యాలెండర్ ప్రకటించి నియామకాలు చేపడతాం

ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు

వినతిపత్రాల నుంచి పోస్టింగ్ ఇచ్చే స్థాయికి వచ్చా

యువత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకుసాగాలి

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చుదాం

కళాశాలల్లో నైతిక పోలీసింగ్ పాఠాలూ నేర్పాలి

ఎన్ఎస్ఎస్, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం





ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం రూ.వేల కోట్లు బకాయి పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాలేజీల యాజమాన్య ప్రతినిధులందరూ కలిసి వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు ప్రతిపాదనలు ఇస్తే.. సమస్యను త్వరగా పరిష్కరించే బాధ్యతను ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు అప్పగిస్తున్నానని చెప్పారు.

హైదరాబాద్, జూలై 13 : ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్క రూపాయి కూడా బకాయి పడకుండా సకాలంలో ఫీజు చెల్లింపులు చేస్తామన్నారు. శనివారం 'క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై వివిధ

మిగతా 2 లో



# అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల ఆందోళన..

గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్

గ్రూప్ 2 పరీక్ష డిసెంబరులో పెట్టాలని విజ్ఞప్తి

మొన్న తలకుమాసినోళ్లే ఆందోళన చేస్తున్నరని, నేడు ఏ పరీక్ష రాయనోళ్లు.. ఏ ఉద్యోగానికి పోటీపడనోళ్లు దీక్షలు చేస్తున్నరని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై నిరుద్యోగులు భగ్గుమన్నారు. 'రాజకీయ పార్టీల ప్రోద్బలంతోనే ధర్నాలు చేస్తున్నారు.. నిరసన తెలిపేటోళ్లంతా అభ్యర్థులు కాదు' అని మాట్లాడడంపై మండిపడుతున్నారు.

చిక్కడపల్లి, జూలై 13 :'కొన్ని రాజకీయశక్తులు, కోచింగ్ సెంటర్ల యాజమాన్యాలే పరీక్షల వాయిదా కోరుతున్నయ్. నోటిఫికేషన్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తం.' అంటూ జేఎన్టీయూ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిందారోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ అభ్యర్థులు రోడ్డెక్కారు. గ్రూప్స్ పోస్టులు పెంచాలని, గ్రూప్-1మెయిన్స్‌లో 1:100 విధానం అమలు చేయాలని, గ్రూప్-2తోపాటు

మిగతా 2 లో

# కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ చేరిక

కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్ రెడ్డి

ఎమ్మెల్యేతో పాటు పలువురు కార్పోరేటర్ల చేరిక

హైదరాబాద్,జూలై13 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ బాట పడుతున్నారు. తెలంగాణలో ఎన్నికల ముగిసిన నాటి నుంచి మొదలైన చేరికలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రేటర్ ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పేసి హస్తం పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే దాదాపు ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా.. ఆ సంఖ్య మరింత పెరుగుతోంది. శుక్రవారం బీఆర్ఎస్

మిగతా 2 లో





# చర్లపల్లి స్టేషన్ నిర్మాణ పనులు 98% పూర్తి

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ఆరేళ్లుగా కొనసాగుతున్న విస్తరణ పనులు

.. వివరాలు 4లో

## 80 ఏళ్ల ముసలావిడకు పెన్షన్ వాపస్ నోటీసులు

కాంగ్రెస్ సర్కార్‌వి వింత చేష్టలు అంటూ కెటిఆర్ ట్వీట్



హైదరాబాద్,జూలై13 : హామీల అమలు, సంక్షేమ పథకాలు ఇవ్వడం పక్కనపెట్టి.. ఇతర పార్టీల నేతల్ని చేర్చుకోవడంపైనే సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టు తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఉందని కేటీఆర్ సెటైర్స్ పేల్చారు. తాము వస్తే కొత్తగా అనేక పథకాలు ఇస్తామని, ఇదివరకే ఉన్న సంక్షేమ పథకాలకు వచ్చే

మిగతా 2 లో

# వారంలో 'అమృత్' టెండర్లు రద్దుచేయాలి..



రేవంత్ సర్కారు చీకటి ఒప్పందాలు

టెండర్లు రద్దు చేయకుంటే ఉద్యమం

పాలనలో లోపించిన పారదర్శకత

40 శాతం ఎక్కువతో మేఘాకు రూ.4 వేల కోట్ల ప్రాజెక్టు పనులు

బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 13 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేసుకుంటూ అవినీతిమయంగా మారిందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జవాబుదారీతనం, పారదర్శకత లోపించిందని, ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన సాగిస్తున్నదని

మిగతా 2 లో



# ఒకటో తేదీనే వేతనాలు ఉత్తమాటే..

మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు జీతాలివ్వండి

మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్

హైదరాబాద్, జూలై 13 : ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామన్న ప్రభుత్వ మాట ఆచరణకు నోచుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. మోడల్ స్కూళ్లలోని ఉపాధ్యాయులకు తక్షణమే వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శనివారం

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 14 జూలై 2024





# ఫీజు రీయింబర్స్‌మెంట్ వన్‌టైమ్ సెటిల్‌మెంట్




**మొదటి పేజీ తరువాయి**

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలతో జేఎన్‌టీయూలో నిర్వహించిన సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి పేదవాడి బిడ్డకు కార్పొరేట్ విద్యను అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

ప్రపంచంలో ఏవైనా మానవ నిర్మాణ అద్భుతాలు ఉన్నాయంటే.. అందుకు కారకులు ఇంజనీర్లేనని సీఎం అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా ఉండొద్దని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే గొప్ప సంస్థలుగా తయారు కావాలని ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. తాత్కాలిక ఉద్యోగాలకు అవకాశమున్న కోర్సులపైనే యాజమాన్యాలు దృష్టిపెడుతున్నాయని, దేశ నిర్మాణానికి అవసరమైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సులను చాలా కళాశాలలు తగ్గించుకుంటున్నాయని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించే కోర్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను తప్పనిసరిగా కాలేజీల్లో నడపాలని, లేదంటే దేశం అత్యంత ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. గత ముఖ్యమంత్రులు చూపిన చొరవ కారణంగా తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతోందని సీఎం పేర్కొన్నారు. రాబోయే 20 ఏళ్లలో ఏ బహుళజాతి సంస్థ సీఈవో అయినా భారతీయుడే ఉంటారని తెలిపారు.

**గ్రూప్-1కు 1:100 చొప్పున అంటే ఇబ్బందులే..**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణం నిరుద్యోగ సమస్య అని, దీనిని పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధులు విఫలమైనట్లేనని సీఎం రేవంత్ అన్నారు. ఈ మేరకే నిరుద్యోగ యువకులు, విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం వివిధ ప్రణాళికలు రూపొందిస్తోందని చెప్పారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను క్లియర్ చేసి.. ఏకకాలంలో 19 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామన్నారు. నాలుగు లక్షల మంది దరఖాస్తు చేసుకున్న గ్రూప్-1 పరీక్షను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పరీక్షకు బయోమెట్రిక్ తీసుకుంటామని నోటిఫికేషన్‌లో పేర్కొని.. తీసుకోకపోవడంతో న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. కానీ, తమ ప్రభుత్వం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నోటిఫికేషన్‌లో పొందుపరిచిన అంశాల ప్రకారమే పరీక్షలు నిర్వహించి ఫలితాలు ఇచ్చిందని చెప్పారు. 2022లో గత ప్రభుత్వం 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపికచేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొందని, అవే మార్గదర్శకాలతో పరీక్షలు నిర్వహించాక.. కొందరు ఇప్పుడు 1:100 చొప్పున అవకాశమివ్వాలంటున్నారని సీఎం అన్నారు. అందుకు తమకేమీ ఇబ్బంది లేదని, కానీ.. కోర్టు మళ్లీ కొట్టేస్తే గ్రూప్-1 వ్యవహారం మొదటికి వస్తుందని పేర్కొన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు గ్రూప్-1 నియామకాలు పూర్తి కాలేదని, అభ్యర్థుల యుక్తవయసు మొత్తం కోచింగ్ సెంటర్లలోనే గడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం..**

మార్చి 31 వరకు ఉద్యోగ ఖాళీల వివరాలు సేకరించి.. జూన్ 2లోగా నోటిఫికేషన్ విడుదల చేసి.. డిసెంబర్ 9లోపు నియామకాలు చేపడతామని సీఎం రేవంత్ ప్రకటించారు. యూపీఎస్సీ సివిల్స్ మాదిరిగా జాబ్ క్యాలెండర్ ఉండాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గతంలో ఔట్‌సోర్సింగ్ వారిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో నియమించారని, ఉద్యోగాల భర్తీ వాళ్లకు అప్పగిస్తే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఆర్‌ఎంపీ డాక్టర్‌ను టీఎస‌పీఎస్సీ సభ్యుడిని చేశారని, ఆయన గ్రూప్-1 అధికారిని ఇంటర్వ్యూ చేసి నియమించడమేంటో చెప్పాలని వ్యాఖ్యానించారు. గ్రూప్-1 పేపర్ తయారు చేసేవారు, నియమించేవారు అంతకంటే పైస్థాయి వారు అయి ఉండాలన్నారు. అంతేతప్ప.. రాజకీయ పునరావాస కేంద్రాలుగా విద్యావ్యవస్థలు మారకూడద న్నారు. తమ ప్రభుత్వం ఏర ్పడిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలు అందించామని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 తదితర అన్ని ఉద్యోగాలనూ ఈ ఏడాది ఆఖర్లోగా భర్తీ చేయాలనుకుంటున్నామని ప్రకటించారు. సెప్టెంబరులో జరగనున్న ఆర్టిఫిషియల్ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ఏఐ లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కోర్ ఇంజనీరింగ్‌ను మరిచిపోకుండా అధునాతన టెక్నాలజీలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ నడిబొడ్డున ఏఐ సిటీ ఏర్పాటుకు 200 ఎకరాలను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారని, ఏఐ గ్లోబల్ సమ్మిట్ అనంతరం ఏఐ సిటీ నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.

**పరీక్షలు రాయనివాళ్లే దీక్షలు చేస్తున్నారు..**

ప్రభుత్వ విధానాలు విద్యార్థుల జీవితాలపై చెడు ప్రభావం చూపకూడదని నియామక పరీక్షలు ఇబ్బంది లేకుండా నిర్వహిస్తుంటే కొందరు వాయిదా కావాలంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కొన్ని రాజకీయ శక్తులు, కోచింగ్ సెంటర్లు.. వాటి స్వలాభం కోసం పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నాయన్నారు. ఏ పరీక్షా రాయనివారు పరీక్షల వాయిదా అడుగుతున్నారని, దీక్ష చేస్తున్న ముగ్గురిలో ఒక్కరు కూడా ఏ పరీక్షా రాయడంలేదని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. "ఒక కోచింగ్ సెంటర్ యజమాని పరీక్ష వాయిదా వేయాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నడు. ఆయన ఏ పరీక్ష రాస్తున్నడని అడిగితే.. ఆయనకు కోచింగ్ సెంటర్ ఉందని, డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేస్తే రూ.100 కోట్లు లాభం వస్తుందన్నట్లు చెబుతున్నారు. మరో ఇద్దరు కూడా ఇతరత్రా రాజకీయ కారణాలతోనే దీక్షలు చేస్తున్నరు" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**రిప్రజెంటేషన్ల నుంచి పోస్టింగ్ ఇచ్చే స్థాయికి వచ్చా: రేవంత్**

'నేను జడ్పీటీసీగా ఉన్నప్పుడు ప్రస్తుత సీపీ శ్రీనివాసరెడ్డి మా జిల్లా ఎస్పీగా ఉన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆయనకు రిప్రజెంటేషన్లు ఇచ్చేవాడిని. సరిగ్గా 15 ఏళ్ల తర్వాత నేను సీఎంను అయ్యాను. అదే శ్రీనివాసరెడ్డికి ఇప్పుడు నేనే పోస్టింగ్ ఇచ్చాను. లక్ష్యంతో పనిచేస్తే అనుకున్నది సాధిస్తారు. అందుకు నేనే నిదర్శనం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం 'డ్రగ్స్ నియంత్రణ, మహిళా భద్రతలో వాలంటీర్లు' అనే అంశంపై జేఎన్‌టీయూలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని పెద్ద పెద్ద స్కూళ్లల్లో విద్యార్థులు పుస్తకాలు పెట్టుకునేందుకు కల్పించే ర్యాక్ సదుపాయంలో గంజాయి చాక్లెట్లు, ఇతర మత్తు పదార్థాలు బయట పడుతుండటం ఆందోళనకరమన్నారు.

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉందని, డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించిందని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులతోపాటు మోరల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కాలేజీల్లో పాఠ్యాంశాలతోపాటు మోరల్ పోలీసింగ్ నేర్పించాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సహకరించాలని కోరారు. సమాజంలో పెడ ధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణమని, పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. తమ ప్రభుత్వం క్రీడలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించిందని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని భావిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పోలీస్ కమిషనర్లు కె.శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల ఆందోళన..

**మొదటి పేజీ తరువాయి**

డీఎస్సీ వాయిదా వేయాలని కొద్దికాలంగా ఉద్యమిస్తున్నా పట్టించుకోకుండా నోటిఫికేషన్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని మొండికిపోవడంపై కన్నెర్రజేశారు.

సీఎం వ్యాఖ్యలకు నిరసనగా అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌తోపాటు, ఇతర అనేక చోట్ల వేలాది మంది ఉద్యోగార్థులు రోడ్డెక్కారు. కాంగ్రెస్ సర్కారు తీరుపై నిప్పులు చెరుగుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. అభ్యర్థుల ధర్నాలతో ఎక్కడికక్కడ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు భారీగా పోలీసులు మోహరించి అభ్యర్థులను పంపిచేందుకు యత్నించినా ఎలాంటి ఫలితం లేకుండాపోయింది.

**అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి రోడ్డెక్కిన నిరుద్యోగులు**

గ్రూప్ 2 పరీక్షలు యథావిధిగా నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి జేఎన్టీయూ వేదిగాక శనివారం సాయంత్రం ప్రకటించారు. ఆ వెంటనే గంటల వ్యవధిలోనే నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచడంతో పాటు డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి అశోక్‌నగర్ చౌరస్తాలో వేలాదిమంది సంఖ్యలో నిరుద్యోగులు మెరుపు ధర్నాకు దిగారు. పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకూ భారీ ర్యాలీ తీశారు. చౌరస్తాలోనే రోడ్డుపైనే బైఠాయించారు. రాత్రి 9గంటల నుంచి అర్ధరాత్రి వరకూ అక్కడే రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నిరుద్యోగుల దీక్షలపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ' సీఎం డౌన్ డౌన్ ' అంటూ అభ్యర్థులు చేసిన నినాదాలతో అశోక్‌నగర్ దద్దరిల్లిపోయింది. 'ఇదేమి లెక్క.. గుంపు మేస్త్రీ లెక్క' అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు తామంతా కృషిచేశామని, తమ బాధను అర్థం చేసుకుని ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను అంగీకరించాలని డిమాండ్ చేశారు.

**దిల్‌సుఖ్‌నగర్‌లో డీఎస్సీ అభ్యర్థులు..**

అశోక్‌నగర్‌లో గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల అభ్యర్థులు ధర్నాకు దిగిన సమాచారం తెలుసుకున్న డీఎస్సీ అభ్యర్థులు క్షణాల్లో దిల్‌సుఖ్‌నగర్‌లో ధర్నాకు దిగారు. వెంకటాద్రి థియేటర్ నుంచి మెట్రో స్టేషన్‌వరకు ర్యాలీ తీశారు. రాజీవ్‌చౌక్‌లో ధర్నాకు దిగారు. డీఎస్సీని తక్షణమే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. "వుయ్ వాంట్ జస్టిస్.. కాంగ్రెస్ డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్' అంటూ నినదించారు. తమ సమస్యను రాజకీయ కోణంలో చూడవద్దని,






రాష్ట్ర భవిష్యత్ దృష్టిలో చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయమైన డిమాండ్లతో తాము చేస్తున్న ధర్నాలను బీఆర్ఎస్, బీజేపీలతో అంటగట్టి రాజకీయం చేయడం సమంజసం కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్‌తో పాటు ఎల్బీనగర్‌లోనూ అభ్యర్థులు ఆందోళనకు దిగడంతో పోలీసులు భారీగా మోహరించారు.

**స్తంభించిన ట్రాఫిక్..**

నిరుద్యోగుల మెరుపు ధర్నాతో అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ రూట్లలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి. మరోవైపు అశోక్‌నగర్‌లో ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో దోమలగూడ, ముషీరాబాద్ పీఎస్‌లతోపాటు, అదనపు సీఆర్పీఎఫ్ బలగాలు రోడ్లపై మోహరించాయి. నిరుద్యోగులను బలవంతంగా పంపించేందుకు యత్నించాయి. అయినా అభ్యర్థులు తమ డిమాండ్లు నెరవేర్చేదాకా కదిలేది లేదని రోడ్లపైనే భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో అర్ధరాత్రి దాటినా పరిస్థితి అదుపులోకి రాలేదు.

**గ్రూప్స్ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నం**

ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై నిరుద్యోగులు మెరుపు ధర్నాకు దిగిన సమయంలోనే ఓ అభ్యర్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అశోక్‌నగర్ ధర్నాలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం మొర్రవానిగూడెం గ్రామానికి చెందిన అభ్యర్థిని మడకం నిత్యమైత్ర పాల్గొన్నది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆవేదనకు గురై వెంటతెచ్చుకున్న గోలీలు మింగి రోడ్డుపైనే పడిపోయింది. సహచర అభ్యర్థులు వెంటనే గాంధీ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఎమర్జెన్సీ ఏఎంసీ వార్డులో చికిత్స అందిస్తున్నారు. అభ్యర్థిని కిందపడిపోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

**మొదటి పేజీ తరువాయి**

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్  కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. శనివారం మరో ఎమ్మెల్యే అరికపూడి గాంధీ హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు ఇంతటితో ఆగనట్లు కనిపిస్తోంది. మరికొంత మంది కూడా బీఆర్ఎస్‌ను వీడిన వారి బాటలోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో గాంధీ చేరారు. ఉదయం 10 గంటలకు జూబ్లిహిల్స్‌లోని సీఎం నివాసంలో ఎమ్మెల్యే... కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అరికపూడి గాంధీతో పాటు పలువురు కార్పోరేటర్లు, నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ఆదివారంఎమ్మెల్సీ నవీన్ కుమార్ రావు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో హస్తం పార్టీలో చేరిన భారాస ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్, భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. అరికెపూడి గాంధీతో పాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత వలసలతో హస్తం పార్టీ దూకుడు పెంచింది. ఓ వైపు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల చేరికలతో శాసనసభ, మండలిలో తన బలాన్ని పెంచుకుంటున్న  కాంగ్రెస్ అటు జీహెచ్ఎంసీ కౌన్సిల్ లోనూ కార్పొరేటర్లను చేర్చుకుని నగరంపై పట్టు సాధించాలని చూస్తోంది.  ఈ క్రమంలోనే పలువురు కార్పొరేటర్లను  కాంగ్రెస్ లో చేర్చుకుంటుంది. దీంతో  జీహెచ్ఎంసీ కౌన్సిల్ లో బీఆర్ఎస్ కార్పొటర్ల సంఖ్య 56 నుంచి  41 కి చేరింది.  జీహెచ్ఎంసీ కౌన్సిల్ లో ప్రస్తుతం కాంగ్రెస్ కార్పొరేటర్లు సంఖ్య 3  నుంచి 25 కు చేరింది. బీజేపీ కార్పొరేటర్ల సంఖ్య 39కి చేరింది.

# వారంలో 'అమృత్' టెండర్లు రద్దుచేయాలి..

**మొదటి పేజీ తరువాయి**

ధ్వజమెత్తారు. 40 శాతం ఎక్కువతో మేఘా కృష్ణారెడ్డికి రూ.4 వేల కోట్ల విలువైన పనులను అప్పగించారని, వీటిని రద్దు చేసి గ్లోబల్ టెండర్లు పిలిస్తే 30 శాతం తకువకే పనులు చేపట్టేందుకు అనేక కంపెనీలు ముందుకొస్తాయని, తద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.1,200 కోట్లు మిగులుతాయని చెప్పారు. వారం రోజుల్లో పాత టెండర్లను రద్దుచేసి గ్లోబల్ టెండర్లు పిలవాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో మేఘా కృష్ణారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసి ఆయనను జైలు పంపిస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి తిరిగి ఆయనకే 40 శాతం ఎకువతో టెండర్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్ర అమృత్ పథకం నిధులకు సంబంధించిన పనులను గ్లోబల్ టెండర్లు లేకుండా ఇచ్చారని, ఇందులో రూ.1200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ అవినీతిని బయటపెట్టి ప్రజాక్షేత్రంలో నిలబెడతామని హెచ్చరించారు. ఈ అవినీతి టెండర్లు రద్దు చేసి గ్లోబల్ టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానాను దోస్తున్న వారు సీఎం దోస్తులా? రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన గుత్తేదారులా? అని నిలదీశారు. సమాధానం చెప్పకుంటే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వారం రోజుల్లో టెండర్లు క్యాన్సిల్ చేయకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం కాంట్రాక్టుకు కూడా గ్లోబల్ టెండర్ వేయాల్సిందేనని స్పష్టంచేశారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

# ఒకటో తేదీనే వేతనాలు ఉత్తమాటే..

**మొదటి పేజీ తరువాయి**

ఓ ప్రకటన చేశారు. మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు గత ఏడు నెలల్లో ఒక్కసారి కూడా ఒకటో తేదీన వేతనం అందలేదని హరీశ్ పేర్కొన్నారు. ఈ నెలలో 13 రోజులు గడిచినప్పటికీ ఇంకా జీతాలు రాకపోవడంతో మోడల్ స్కూళ్లలో పని చేసే రెగ్యులర్ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో ప్రభుత్వం మాట తప్పడం బాధాకరమని హరీశ్ వాపోయారు.

# 80 ఏళ్ల ముసలావిడకు పెన్షన్ వాపస్ నోటీసులు

**మొదటి పేజీ తరువాయి**

డబ్బును పెంచుతామని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం లబ్దిదారుల నుండి సొమ్మును వెనక్కి తీసుకుంటుందని విమర్శించారు. రాష్ట్రంలో లబ్దిదారుల నుండి సొమ్మును వెనక్కు రాబట్టే వింత చేష్టలు కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏవో కారణాలు చెబుతూ వేలాది మంది ఆసరా పెన్షన్ లబ్దిదారుల నుండి డబ్బును

ప్రభుత్వానికి వెనక్కు పంపాలని నోటీసులు ఇస్తోందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 80 ఏళ్ల ముసలమ్మ దాసరి మల్లమ్మకు ఆసరా పెన్షన్ కింద వచ్చిన ఒక లక్షా రూ.72 వేలు వెనక్కు కట్టాలని నోటీసులు ఇచ్చారు. ఒంటరి మహిళ, పక్షవాతంతో బాధపడుతూ ఉన్న ఇలాంటి వృద్ధుల నుంచి గతంలో కేసీఆర్ సర్కారు ఇచ్చిన ఆసరా పెన్షన్ సొమ్మును తిరిగి లాక్కోవడానికి రేవంత్ సర్కార్ ప్రయత్నించడం అమానవీయ వైఖరికి నిదర్శనం. కనుక వెంటనే పేదల మీద ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గపు చర్యలు మానుకోవాలి. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలే తిరగబడతారు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# అమరావతిలో నూతన ఆధ్యాత్మిక ఒరవడి

## గోకుల క్షేత్ర నిర్మాణం ఆహ్వానించదగ్గ పరిణామం

**మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ**

అమరావతి,జూలై 13 : అమరావతి నగరంలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టటం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. దేవాలయాల్లో కూడా రాజకీయాలు చొరబడి, ఆలయాలు నిర్మించకుండా చేసిన ప్రభుత్వాలను మనం చూశామన్నారు. దేవుడు ఉన్నాడు కాబట్టే ఎన్నో అవరాధాలు అధిగమించి గోకుల క్షేత్రం నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడటం ఎంతో ముఖ్యమన్నారు. ఇందులో ఇస్కాన్ సంస్థ ముందుండటంతో  పాటు ఎంతోమందికి అన్నదానం కూడా చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అన్నా క్యాంటీన్లను సీఎం చంద్రబాబు ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించడటం శుభపరిణామమని ఎన్వీ రమణ పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ ఎంతో తోడ్పాటునిచ్చిందన్నారు. ఎవరూ అర్థాకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ఎంతోమందికి అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేస్తోందన్నారు. అమరావతి నగరంలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టటం శుభసంకేతమన్నారు. దేవాలయాల్లో కూడా రాజకీయాలు చొరబడి, ఆలయాలు నిర్మించకుండా చేసిన ప్రభుత్వాలను మనం చూశామని పేర్కొన్నారు. దేవుడు ఉన్నాడు కాబట్టే ఎన్నో అవరాధాలు అధిగమించి గోకుల క్షేత్రం నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందని ఎన్వీ రమణ అన్నారు. సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడటం ఎంతో ముఖ్యమని ఎన్వీ రమణ పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ ఎంతో తోడ్పాటునిచ్చిందన్నారు. ఎవరూ అర్థాకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఇస్కాన్ సంస్థ ఎంతోమందికి అక్షయపాత్ర ద్వారా అన్నదానం చేస్తోందని ఎన్వీ రమణ పేర్కొన్నారు.



## గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ఆర్థిక సహాయం



కేసముద్రం జూలై 13 (రోమింగ్ న్యూస్): కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో గౌడ సంఘ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐదు లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని శనివారం హైదరాబాద్ లో గాయత్రి గ్రానైట్ అధినేత రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధసిరి శ్రీనివాస్,కారు-పోతుల యాకయ్య,ముంజ కుమారస్వామి,చిర్ర శ్రీధర్ నలమస సందీప్ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



కేసముద్రం జూలై 13 (రోమింగ్ న్యూస్): కేసముద్రం మండలం రంగాపురం శివారులో అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో రాజీవ్ నగర్ తండా లకావత్ రెడ్యాకు చెందిన ఆవు మృతి చెందింది. కేసముద్రంలో శనివారం రెడ్యా తెలిపిన ప్రకారం... శుక్రవారం తన పశువుల మందను అటవీ ప్రాంతంలో మేపుకొని తిరిగి వస్తుండగా సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తెగిపడిన విద్యుత్ వైర్ ను ఆవు తొక్కడంతో విద్యుత్ షాక్ కు గురై కింద పడిపోయింది. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన అనంతరం వెళ్లి చూడగా ఆవు అప్పటికే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.40వేలు ఉంటుందని ఆయన తెలిపారు. నిరుపేద గిరిజనుడైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

## ఎయిమ్స్ నుంచి రాజ్‌నాథ్ డిశ్చార్జ్

### ఆరోగ్యంగానే ఉన్నారని వెల్లడి

న్యూఢిల్లీ,జూలై 13 : వెన్నునొప్పి కారణంగా ఎయిమ్స్‌లో చేరిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. రెండ్రోజుల క్రితం ఆయన వెన్నునొప్పి కారణంగా ఆసుపత్రిలోని న్యూరోసర్జరీ విభాగంలో చేరారు. నొప్పి తీవ్రతను గుర్తించి చికిత్స అందించామని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ మెడికల్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ రీమా దాదా తెలిపారు. ఃాజ్‌నాథ్ సింగ్ మూడ్రోజుల క్రితమే 73వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కఠోర శ్రమ, సేవాభావంతో ప్రజల మన్ననలను రాజ్‌నాథ్ అందుకున్నారని, రక్షణ శాఖ మంత్రిగా భారతదేశ రక్షణ సంపత్తిని పటిష్టం చేయడంలో ముందున్నారని అన్నారు. రాజ్‌నాథ్ సింగ్ చిరకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని తన సందేశంలో మోదీ అభిలషించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌నాథ్ ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగమైన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సభ్యుడిగా తన కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బీజేపీ యువజన విభాగంలో చేరారు. వివాదరహితుడిగా పేరున్న ఆయన ప్రస్తుతం లక్నో లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## నిరుద్యోగులను మోసగించిన షాదాబ్ అలాం

### అరెస్ట్ చేసిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు

హైదరాబాద్,జూలై 13 : భారత్‌కు చెందిన నిరుద్యోగ యువతను ఉద్యోగం పేరుతో కాంబోడియా పంపించి మోసాలు చేయిస్తోన్న కీలక నిందితుడిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీలో షాదాబ్ అలాంను అరెస్టు చేసిన పోలీసులు నగరానికి తీసుకొచ్చి నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. సిరిసిల్లకు చెందిన బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సిరిసిల్ల పోలీసులు గతంలో ఏజెంట్ సాయిప్రసాద్, దిల్లీకి చెందిన మరో ఏజెంట్ అన్సారీని అరెస్టు చేశారు. దుబాయ్‌లో ఉండి చైనీయులకు సహకరిస్తున్న షాదాబ్ దిల్లీకి వచ్చినట్టు తెలుసుకుని అరెస్టు చేశారు. దుబాయ్‌లో ఉంటున్న షాదాబ్.. కాంబోడియా దేశంలో చైనీయుల కోసం పనిచేస్తున్న దీపు అనే వ్యక్తికి ఏజెంటుగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. చాలా మంది యువతను మోసం కాంబోడియా పంపినట్టు గుర్తించారు. మే 16న సిరిసిల్ల పీఎస్‌లో నమోదైన ఈ కేసు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి బదిలీ అయింది.

## సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ కిడ్నాప్

### ఐదు గంటల్లో ఛేదించిన పోలీసులు

హైదరాబాద్,జూలై 13 : ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ కిడ్నాప్‌నకు గురయ్యాడు. ఫిర్యాదు అందిన అయిదు గంటల్లోనే జూబ్లీహిల్స్ పోలీసులు బాధితుడిని గుర్తించడంతో పాటు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. జూబ్లీహిల్స్‌లోని హుడా ఎన్‌క్లేవ్ నందగిరిహిల్స్‌లో నివసించే వాకటి రవిచంద్రారెడ్డి రాయదుర్గం టీ-హబ్ సమీపంలోని ఆర్బిట్‌మాల్‌లో 'గిల్ గైజ్ పేరుతో గత నవంబరులో సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రారంభించాడు. కన్సల్టెన్సీల ద్వారా 1500 మంది ఉద్యోగులకు శిక్షణనిచ్చి దశలవారీగా ఉద్యోగాల్లోకి తీసుకున్నాడు. కొద్ది నెలలపాటు జీతాలు చెల్లించినా జనవరి నుంచి చెల్లించడం లేదు. ఈ నెల 9న అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో రవిచంద్రారెడ్డి ఇంటికి ఎనిమిది మంది కన్సల్టింగ్ సిబ్బంది వచ్చారు. ఆయనతో కాసేపు మాట్లాడారు. అనంతరం రవిచంద్రారెడ్డి, అతని స్నేహితుడైన మోహన్‌ను బలవంతంగా కార్లలో తీసుకెళ్లారు. నగరంలో పలు ప్రాంతాలు తిప్పి చివరికి నాగర్‌కర్నూల్ జిల్లా ఒంగూరులోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి బంధించారు. అంతకుముందే మూత్రవిసర్జన పేరుతో మోహన్ కారులోంచి దిగి పారిపోయాడు. కుమారుడు తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన రవిచంద్రారెడ్డి తల్లి వాకటి మాధవి గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ చేపటి రాత్రి 10గంటల ప్రాంతంలో నిందితులున్న ప్రాంతాన్ని గుర్తించి వారందరిని అదుపులోకి తీసుకొని గురువారం అర్ధరాత్రికి ఠాణాకు తరలించారు. వీరితోపాటు తీసుకెళ్లిన 82 ల్యాప్‌టాప్‌లను, కొన్ని చరవాణులు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్ చేసి దాడికి పాల్పడినట్లు బాధితుడు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. కిడ్నాప్ చేసినవారిలో జగదీశ్, గౌతం, సుజిత్, శివ, ఆజాద్, మల్లేష్, ప్రవీణ్, కమల్‌లు ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. సంస్థ ఉద్యోగులు శుక్రవారం ఠాణా వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. ఉద్యోగాల పేరుతో దాదాపు రూ. 15కోట్లు వసూలు చేశారన్నారు. రవిచంద్రారెడ్డి ఇటీవల ఎంపీ ఎన్నికల్లో విజయవాడ నుంచి లిబరేషన్ కాంగ్రెస్ తరుపున బరిలో నిలిచి మధ్యలోనే వెనక్కితీసుకొన్నారు. అతని సోదరి చాందినిరెడ్డి ఇదే పార్టీ నుంచి నంద్యాలలో బరిలో నిలిచారని తెలిపారు. తమ డబ్బులతో ఎన్నికల బరిలో నిలిచారని ఆరోపించారు. రాయదుర్గం ఠాణాలో ఫిర్యాదు చేయాలని వారికి జూబ్లీహిల్స్ పోలీసులు సూచించారు. నియామకాలు చేసుకున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వని కా రణంగానే మాట్లాడటానికి తీసుకెళ్లామని అరెస్ట్ అయిన కన్సల్టింగ్ కంపెనీ సిబ్బంది పోలీసులకు తెలిపారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలను కృషి చేయాలి

### పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి

### సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణం

### స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్,జూలై 13 : డ్రగ్స్‌పై యుద్ధం ప్రకటించాలి.. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఎవరికి వారు సీరియస్‌గా దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జేఎన్టీయూలో స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరించుకుంటే దుష్ఫలితాలను నివారించుకోవచ్చు అని సీఎం తెలిపారు. సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారింది. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించవచ్చన్నారు. కుటుంబ వ్యవస్థ విచిన్నం కావడమే చిన్నారుల మానసిక బలహీనతలను కారణం. చిన్నారుల మానసిక దృఢత్వానికి ఉమ్మడి కుటుంబం తోడ్పడుతుంది. పిల్లలను మానసికంగా సంసిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. ఇందు కోసం పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో సబ్జెక్ట్ నేర్పించడమే కాదు.. మోరల్ పోలీసింగ్ కూడా నేర్పించాలి. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలని నిర్వాహకులకు సూచించాం. స్కూళ్లు, కాలేజీల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ అవసరం ఎంతో ఉంది. పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే.. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చవచ్చు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసింది. డ్రగ్స్ పై ప్రభుత్వం యుద్ధమే ప్రకటించింది. మీ అన్నగా పిలుపునిస్తున్నా? డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండి. ఉద్యమాల గడ్డ తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి. అన్ని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో కేరళ మాదిరిగా మోరల్ పోలీసింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నానని సీఎం చెప్పారు. మోరల్ పోలీసింగ్‌తో అన్ని రకాల సమస్యలను పరిష్కరించొచ్చు అని రేవంత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్‌లో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యత. సమస్యలకు భయపడి పారిపోవద్దు? నిలబడి సమస్యలపై పోరాడాలి. జీవితంలో ఫోకస్‌గా పనిచేయండి.. లక్ష్యాలను సాధిస్తారు. రోజుకు 16 గంటలు మీరు ఎంత ఫోకస్‌గా పని చేస్తారో? అది మీ లక్ష్యాన్ని అంత చేరువ చేస్తుంది. మన జీవితం మన చేతుల్లోనే ఉంది? మన జీవితాన్ని ఎలా డిజైన్ చేసుకోవాలో మన చేతుల్లోనే ఉంటుంది. గొప్ప వ్యక్తులు ఎవరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదు. ఎవరూ ఎవరికంటే తక్కువ కాదు అని రేవంత్ పేర్కొన్నారు.

## సోనియాతో ఝార్ఖండ్ సిఎం హేమంత్ దంపతుల భేటీ

### మర్యాద పూర్వకంగా కలిసనట్లు సోరేన్ వెల్లడి



న్యూఢిల్లీ,జూలై 13 : ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తిరిగి పదవీ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజులకు శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీతో భేటీ అయ్యారు. భార్య కల్పనతో కలసి హేమంత్ సోరెన్ ఢిల్లీలో 10 జన్‌పథ్ నివాసంలో సోనియాతో సమావేశం అయ్యారు. ఇది మర్యాదపూర్వక సమావేశమేనన్న సోరెన్ లోక్‌సభ ఎన్నికల తరువాత, తాను జైలులో నుంచి విడుదల అయిన పిమ్మట సోనియాను కలుసుకోలేదు కనుక ఆమెతో భేటీ కోసం వచ్చినట్లు తెలియజేశారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల గురించి సోనియాతో చర్చించారా అని విలేకరులు ప్రశ్నించినప్పుడు, 'ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి చర్చలు కొనసాగుతాయి/ ఎన్నికల గురించి చర్చించలేదు' అని సోరెన్ సమాధానం ఇచ్చారు. 'భారతీయులు అత్యంత సున్నిత మనస్కులు, సహనశీలురు. వారు వీలైనంత వరకు సహనం వహిస్తారు. సహనం కోల్పోతే వోటింగ్ ద్వారా తమ మాట వినిపిస్తారు' అని ఆయన చెప్పారు, ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజీవ్రాల్‌కు కూడా త్వరలో బెయిల్ మంజూరు అవుతుందని సోరెన్ ఆశాభావం వెలిబుచ్చారు. భూ కుంభకోణంతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసు సందర్భంగా ఇడి జనవరి 31న అరెస్టు చేయడానికి ముందు జెఎంఎం ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. జైలులో సుమారు ఐదు మాసాలు గడిపిన అనంతరం సోరెన్ బెయిల్ సంపాదించి ఈ నెల 4న తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు.

ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజీవ్రాల్ భార్య సునీతా కేజీవ్రాల్‌తో కూడా సమావేశం అయ్యారు. ఢిల్లీ సిఎం అధికార నివాసంలో జరిగిన ఆ సమావేశానికి ఆప్ రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్ కూడా హాజరయ్యారు. 'నియంతృత్వానికి వ్యతిరేకంగా ఇండియా సంఘటితంగా ఉంది' అనే వ్యాఖ్యతో ఆప్ ఆ సమావేశం వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

## రియల్టర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

### కన్నకొడుకే కాలయముడని నిర్ధారణ.. ఆస్తికోసం తండ్రిని చంపించిన తనయుడు

హైదరాబాద్,జూలై 13 : కన్నకొడుకే తండ్రి పాలిట కాలయముడయ్యాడు. ఆస్తికోసం తండ్రిని ముట్టు పెట్టాడు. చేతికి మట్టి అంటకుండా సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించాడు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సంచలనం సృష్టించిన హత్యకేసు చిక్కుముడిని పోలీసులు ఛేదించారు. రియల్టర్ కమ్మరి కృష్ణను అతడి కుమారుడే హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించి నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు మొదటి భార్య కుమారుడని పోలీసులు తెలిపారు. ఆస్తి మొత్తం మూడో భార్యకు రాసిస్తున్నాడనే కక్షతో ఈ దారుణానికి ఒడిగట్టాడని పేర్కొన్నారు. రూ.25 లక్షల సుపారీ ఇచ్చి ముగ్గురితో హత్య చేయించినట్లు వివరించారు. నిందితుల నుంచి 3 కత్తులు, 2 కార్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కృష్ణ మొదటి భార్య, ఆమె పిల్లలను పట్టించుకోకుండా రెండో వివాహం చేసుకోగా ఆమె మృతి చెందిన తర్వాత మూడో వివాహం చేసుకున్నాడు. మూడో భార్య పావనికి 16 నెలలు కుమార్తె ఉంది. ఆమె పేరిట దాదాపు రూ.16 కోట్ల విలువచేసే ఆస్తిని కేకే రిజిస్ట్రేషన్ చేశారు. తన తండ్రిని ఇలాగే వదిలేస్తే ఆస్తి మొత్తం పావనికే రాసి ఇస్తాడని ఉద్దేశంతో ఎలాగైనా కృష్ణను చంపాలని అతని కుమారుడు పథకం వేశాడు. కృష్ణ వద్ద పని చేసే అంగరక్షకుడు బాబా శివానంద్ అలియాస్ బాబాకు 25 లక్షలు, ఒక ఇల్లు ఇస్తానని ఆశ చూపాడు. ఇందుకు అంగీకరించిన బాబా శివానంద్ రూ.2లక్షలు అడ్వాన్స్ తీసుకొని ఈ నెల 10వ తేదిన సాయంత్రం 5.30 గంటలకు బాబా, జీలకర్ర గణెలిష్ అలియాస్ లడ్డు, మైనర్ బాలుడితో కలిసి కమ్మదనంలోని కేకే ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. జీలకర్ర గణెలిష్, మైనర్ బాలుడు ఇద్దరు కలిసి కమ్మరి కృష్ణ చేతులు వెనక్కి పట్టుకోగా... బాబా తనతో పాటు తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి, పొట్టలో పొడిచి పరారయ్యారు. అతని అరుపులు విని పైఅంతస్తులో ఉన్న భార్యవచ్చి కృష్ణను శంషాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ హత్యపై మృతుడు కమ్మరి కృష్ణ మూడో భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఒక ద్వి చక్ర వాహనం, మూడు కత్తులు ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని డీసీపీ రాజేష్ తెలిపారు. మృతుడు కృష్ణకు రూ.వంద కోట్లకుపైగా ఆస్తులున్నాయి. ఇతని మొదటి భార్యకు ఇద్దరు కుమారులున్నారు. మూడో భార్య సంతానం మొదటి పుట్టినరోజు వేడుకలు 4 నెలల క్రితం నగరంలో చేశారు.

## ఎపిలో భారీగా ఐపిఎస్‌ల బదిలీలు

### పలు జిల్లాలకు కొత్తగా ఎస్పీల నియామకం

అమరావతి,జూలై 13 : ఏపీలో ప్రభుత్వం భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేసింది. మొత్తం 37 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జీఓ ఆర్టీ నంబర్ 1252 జారీ చేశారు. పాలనలో ప్రక్షాళన తీసుకురావడానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం మీద పట్టు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ఈ బదిలీలు చేపట్టారు. చర్యల్లో భాగంగా ఇప్పటికే ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం 37 మంది ఐపీఎస్‌లను ఏపీ ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలిలా..ఉన్నాయి. కేవీ మహేశ్వరరెడ్డిని శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. వకుల్ జిందాల్‌ను విజయనగరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఎం దీపికాను అనకాపల్లి ఎస్పీగా బదిలీ చేశారు. వి. రత్నను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఎస్వీ మాధవ్ రెడ్డిని పార్వతీపురం ఎస్పీగా, విక్రాంత్ పాటిల్‌ను కాకినాడ జిల్లా ఎస్పీగా, ఏపీ ఎస్పీ కాకినాడ మూడో బెటాలియన్ కామాండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్ సతీష్ కుమార్‌ను గుంటూరు జిల్లా ఎస్పీగా, అమిత్ బర్ధర్‌ను అల్లూరు సీతారామరాజు జిల్లా ఎస్పీగా, తుహిన్ సిన్హాను విశాఖపట్నం సిటీ డిప్యూటీ కమిషనర్ 2గా, డి . నరసింహా కిషోర్‌ను ఎస్పీ ఈస్ట్ గోదావరికి బదిలీ చేశారు. వి. విద్యాసాగర్ నాయుడును ఎస్పీగా అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. బి. కృష్ణారావును ఎస్పీగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు, ఆర్. గంగాధర్ రావును కృష్ణాజిల్లా ఎస్పీగా, అద్నాన్ నయీం అస్మీని ఎస్పీగా పశ్చిమ గోదావరి జల్లాకు, అజితా వేజెండ్లను విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీసు వన్‌గా, కె. ప్రతాప్ శివకిషోర్‌ను ఎస్పీగా ఏలూరు జిల్లాకు, కె.శ్రీనివాసరావును పల్నాడు జిల్లా ఎస్పీగా,మల్లికా గార్గ్‌ను ఏపీ ఎస్పీ 5వ బెటాలియన్ విజయనగరంకు, ఏఆర్ దామోదర్‌ను ప్రకాశం జిల్లా ఎస్పీగా, జి. బింద్ మాదవ్‌ను కర్నూలు జిల్లా ఎస్పీగా జి.కృష్ణకాంత్‌ను నెల్లూరు జిల్లా ఎస్పీగా,అదిరాజ్ సింగ్ రాణాను నంద్యాల జిల్లా ఎస్పీగా, వి.హర్షవర్ధన్ రాజును వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీగా, కేవీ. మురళి కృష్ణను అనంతపురం ఎస్పీగా, గౌతమి శాలిని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ సీపీ లా అండ్ ఆర్డర్ వన్‌గా, ఎల్. సుబ్బరాయుడును తిరుపతి ఎస్పీగా, ఆయనకే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వి. గీతికాదేవిని ఇంటలిజెన్స్ అడ్మిన్ ఎస్పీగా, జీఆర్. రాధికాను, డీ. మేరి ప్రశాంతిని డీజీపీ ఆఫీసులో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కె. ఆరిఫ్ హఫీస్, కె. రఘువీరారెడ్డి, సిద్దార్ద్ కౌశల్, సుమిత్ సునీల్, పీ. జగదీష్, ఎస్ శ్రీధర్, ఎం. సత్తిబాబులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు డీజీపీ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని ఆదేశం ఇచ్చారు. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## తిరుమలకు పోటెత్తిన భక్తులు

### శ్రీవారి దర్శనం కోసం 30 గంటల సమయం

తిరుమల,జూలై 13 : శ్రీవారి దర్శనానికి తిరుమలలో భక్తుల రద్దీ శనివారం పెరిగింది. భారీగా భక్తులు తరలి రావడం, ఉచిత సర్వదర్శనం టైమ్ స్లాట్ లేని భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగు రోడ్డు మీదుగా అక్టోపస్ భవనం వరకు దాదాపు 3 కిలోమీటర్ల వరకు క్యూలైన్లు బారులుదీరాయి. వీరికి శ్రీవారి దర్శనం కోసం 30 గంటల సమయం పడుతుందని తితిదే ప్రకటించింది. క్యూ లైన్లలో ఉన్న భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాలను సిబ్బంది అందిస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. తితిదే భద్రతాధికారులు, అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ రద్దీ ఆదివారం వరకు కొనసాగే అవకాశం ఉంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 14
జూలై 2024





# చర్లపల్లి స్టేషన్ నిర్మాణ పనులు 98% పూర్తి

న్యూఢిల్లీ/కుషాయిగూడ, జూలై 13 : చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు 98 శాతం పూర్తయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.434 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న ఈ స్టేషన్ రాష్ట్రంలోనే నాలుగో అతి పెద్ద రైల్వే స్టేషన్‌గా అవతరించబోతుందని వెల్లడించారు. ఈ మేరకు చర్లపల్లి రైల్వేస్టేషన్ చిత్రాలను శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ స్టేషన్ అందుబాటులోకి వచ్చాక హైదరాబాద్, సికిందరాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీ తగ్గుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, దాదాపు ఆరేళ్లుగా కొనసాగుతోన్న చర్లపల్లి రైల్వే టర్మినల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. చర్లపల్లి భరత్ నగర్ వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి కూడా నిర్మాణం పూర్తి చేసుకొని వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం నుంచి గోకుల్‌నగర్, మల్లాపూర్, ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జి వరకు వంద అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు భూసేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించాలని భావించినా, సాంకేతికపరమైన కొన్ని పనులు పూర్తికాకపోవడంతో మరి కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 98 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. కానీ, స్టేషన్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేదు. దీంతో ఈ విషయం మరోసారి చర్చనీయాంశమైంది.






# ఉప ఎన్నికల ఫలితాల్లో బిజెపికి భంగపాటు

**13 స్థానాల్లో కేవలం 2 స్థానాలకే బిజెపి పరిమితం**

**11 స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థుల విజయం**

న్యూఢిల్లీ,జూలై 13 : వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపికి భంగపాటు జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమికి గట్టి పోటీ ఇచ్చిన ఇండీ కూటమి ఈనెల 10న జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ అదే స్థాయిలో పోటీ ఇచ్చింది. మొత్తం 7 రాష్ట్రాల్లో 13 స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు వెలువడ్డాయి. ఇండీ కూటమి 10 సీట్లు గెలుచుకుంది. అటు బీజేపీ మాత్రం కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, వెస్ట్ బెంగాల్, బిహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. ఇండీ కూటమిలోని పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్,డీఎమ్‌కే, ఆప్ అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో దిగి విజయం సాధించారు. ఇలా బీజేపీకి మరోసారి ఈ కూటమి షాక్ ఇచ్చింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే పంజాబ్‌లోని జలంధర్‌లో గెలవడం ఆప్‌కి చాలా కీలకమైంది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కే ఇది ఓ పరీక్ష లాంటిది. అంత కీలకమైన నియోజకవర్గంలో 23 వేల ఓట్ల మెజార్టీతో ఆప్ అభ్యర్థి విజయం సాధించారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో నాలుగు చోట్ల ఎన్నికలు జరగ్గా అన్ని చోట్లా తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. బీజేపీ వెనకబడిపోయింది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సతీమణి కమ్లేశ్ ఠాకూర్ విజయం సాధించారు. డెహ్రా నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. మరో చోట కూడా కాంగ్రెస్ గెలిచింది. తమిళనాడులో విక్రవంది నియోజకవర్గంలో డిఎంకె అభ్యర్థి విజయం సాధించారు. ఉత్తరాఖండ్‌లో బద్రినాథ్‌తో పాటు మంగళూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయ పతాకం ఎగరేసింది. ఈ రెండు చోట్లా బీజేపీ వెనకబడింది. అటు బిహార్‌లో జేడీయూ అభ్యర్థి ముందు ఆధిక్యంలో ఉన్నప్పటికీ ఆ తరవాత స్వతంత్ర అభ్యర్థి లీడ్‌లోకి వచ్చారు. ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరవాత వెలువడుతున్న ఫలితాలు కావడం వల్ల ఉత్కంఠ పెరిగింది. పైగా బీజేపీ గ్రాఫ్ పడిపోయిందన్న వాదనలు వినిపిస్తున్న సమయంలోనే ఇలాంటి ఫలితాలు రావడం మరింత కీలకంగా మారింది. మెజార్టీ స్థానాల్లో ప్రతిపక్ష కూటమి అభ్యర్థులే విజయం సాధించడం ఆ పార్టీలకు మరింత జోష్ ఇచ్చింది.

# అంబానీ తనయుడి వివాహంలో లోకేశ్ దంపతులు

**అక్కడే బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో భేటీ**

అమరావతి,జూలై 13 : ముంబైలో జరుగుతున్న అనంత్ అంబానీ - రాధిక మర్చంట్ వివాహ వేడుకకు ఏపీ మంత్రి నారా లోకేశ్ సతీసమేతంగా హాజరయ్యారు. ఇదే పెళ్లి వేడుకకు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కూడా వచ్చారు. ఆయనను నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు కలిశారు. టోనీతో పలు కీలక విషయాలపై చర్చించారు. పరిపాలన, విద్యా, ఆరోగ్యం, రాజకీయ రంగాల్లో ఏఐ సాంకేతికత వినియోగం, తదితర అంశాలపై చర్చించారు. వివిధ రంగాల్లో ఏఐ వినియోగం ద్వారా ఆదాయ సృష్టికరణపై అవకాశాల గురించి లోకేష్ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ట్విట్టర్(ఎక్స్)లో ఓ ట్వీట్ చేశారు. 'ఈరోజు నేను, నా భార్య బ్రాహ్మణీ యూకే మాజీ ప్రధానమంత్రి, టోనీ బ్లెయిర్‌ను కలుసుకున్నాం. ప్రభుత్వం, విద్యా, ఆరోగ్యం, రాజకీయాలు వంటి వివిధ రంగాల్లో ఏఐ దాని అనువర్తనాలపై మా మధ్య చర్చ జరిగింది. ఆదాయాలను పెంచడానికి మేము దానిని ఎలా ఉపయోగించవచ్చనే అంశంపై చర్చించాం. అర్థవంతమైన చర్చకు ఆస్కారం ఇచ్చిన టోని బ్లేయర్‌కు ధన్యవాదాలు. ఆయనతో ఉమ్మడి ఎజెండాలో కలిసి పనిచేయడానికి మేము ఎదురుచూస్తున్నాం' అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# చంద్రబాబుకు ఉన్న పవర్ వల్లనే రిఫైనరీ



**తెలంగాణకు మొండిచేయి చూపిన కేంద్రం**

**ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన ఒరిగేదేమీ లేదు**

**మాజీ ఎంపి వినోద్ కుమార్ విమర్శలు**

హైదరాబాద్,జూలై 13 : 8 మంది ఎంపీలను గెలిపించినా బీజేపీ తెలంగాణ ప్రజలకు మొండి చేయి చూపిస్తోందని మాజీ ఎంపి , బిఆర్ఎస్ నేత వినోద్ కుమార్ విమర్శించారు. తెలంగాణకు కేంద్రం ఐటీఐఆర్ ఇవ్వలేదని.. కేసీఆర్ కొత్తగా జిల్లాలు ఏర్పాటుచేస్తే ఒక్క నవోదయ విద్యాలయం కూడా ఇవ్వలేదని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఎన్నికల తర్వాత బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాజకీయాల గురించి తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఒక్క చర్చ లేదని అన్నారు. ఏపీకి ఆయిల్ రిఫైనరీ ఇచ్చినట్లుగానే.. తెలంగాణకు విభజన చట్టంలో పేర్కొన్న కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో గెలిచి వేరే పార్టీలో చేరుతున్న వాళ్లను చూసి బాధ పడాల్సిన పనిలేదని మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. వాళ్లు అప్పుడు అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరుతున్నామని చెప్పారని.. ఇప్పుడు కూడా అదే చెప్పి పార్టీ మారుతున్నారని విమర్శించారు. పార్టీలు మారే ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వాళ్లు తిరిగి వస్తామంటే ప్రజలు రానివ్వరని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. త్వరలోనే పార్టీ సమావేశాలు పెట్టుకుందామని.. కొత్తతరం నేతలను కేసీఆర్ ప్రోత్సహిస్తారని చెప్పారు. బీజేపీకి కేంద్రంలో సొంతంగా మెజారిటీ రాలేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్ అన్నారు. టీడీపీ, జేడీయూ తదితర పార్టీల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందని తెలిపారు. ఏపీ విభజన చట్టంలో ఉన్న అంశాలపై ఇటీవల చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు ప్రధాని మోదీతో మాట్లాడారని చెప్పారు. ఆ తర్వాత విభజన చట్టం షెడ్యూల్ 13లో ఉన్న పెట్రో, కెమికల్, ఆయిల్ రిఫైనరీ హబ్ ఏపీకి ఇస్తున్నట్లుగా ప్రముఖ పత్రికలో వార్తలు వచ్చాయని అన్నారు. ఇదే షెడ్యూల్ 13లో తెలంగాణకు కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఉందని తెలిపారు. పదేళ్లుగా అడుగుతున్నా తెలంగాణకు ఏమీ ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

ఏపీలో పెట్రో కెమికల్స్ రిఫైనరీ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని.. మాకు రావాల్సినవి కేంద్రం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నామని బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ తెలిపారు. చంద్రబాబుపై కేంద్రం ఆధార పడింది కాబట్టే ఏపీకి పెట్రో, కెమికల్ హబ్ ఇస్తున్నారని.. ఇక్కడ తెలంగాణపై ఆధారపడలేదు కాబట్టే ఏమీ ఇవ్వడం లేదా అని ప్రశ్నించారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం 30 ఏళ్లుగా పోరాటం జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అదే మోదీకి ఏపీలో సొంతంగా సీట్లు వచ్చి ఉంటే అక్కడ కూడా ఏమీ ఇచ్చేవాళ్లు కాదని విమర్శించారు. ఏపీలో ప్రాంతీయ పార్టీ గెలిచింది కాబట్టే చంద్రబాబు అడిగినవన్నీ ఇస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బోయిన్‌పల్లి వినోద్ కుమార్ తెలిపారు. కొన్నిసార్లు కొన్ని కారణాలతో ఓడిపోతుండవచ్చని ఆయన అన్నారు. వచ్చే ఐదేళ్ల తర్వాత బీఆర్ఎస్ బ్రహ్మాండమైన మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు

**జాతీయ మహిళా కమిషన్ ఫిర్యాదు**

**అసభ్యకర పోస్ట్ పెట్టిన అహ్మద్‌పై కేసు నమోదు**

న్యూఢిల్లీ,జూలై 13 : అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు పెట్టిన ఓ నెటిజన్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం దీనిపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఆ కామెంట్లు చేసిన నెటిజన్ అకౌంట్ వివరాల కోసం సంబంధిత సోషల్ మీడియా సంస్థను సంప్రదించినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భారత సైనికుడు అంశుమాన్ సింగ్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది. ఇటీవల ఆయన సతీమణి స్మృతిసింగ్ రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో యావత్ భారతదేశం అమరవీరుడి కుటుంబాన్ని కీర్తించింది. అవార్డు స్వీకరించే సమయంలో స్మృతి ముఖం చూసిన దేశ ప్రజల కళ్లు చెమర్చాయి. కానీ కొందరు మాత్రం ఆ వీడియోపై అభ్యంతరకర కామెంట్లు పెట్టడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఢిల్లీకి చెందిన అహ్మద్ అనే వ్యక్తి అసభ్యకరంగా చేసిన కామెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్ ను కోరారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఆ యువకుడి చర్యను తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ పోలీసులు తక్షణమే అతడిని అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 26వ బెటాలియన్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన కెప్టెన్ అంశుమాన్ సింగ్ గతేడాది జులై 19న విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. సియాచిన్‌లో వారు ఉంటున్న బేస్ క్యాంప్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో చిక్కుకొన్న జవాన్లను కెప్టెన్ ధైర్యంగా కాపాడి బయటకు తీసుకొచ్చారు. అగ్నికీలలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ తీవ్ర గాయాలపాలై మరణించారు. ఆయన శౌర్యానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డును అందించింది.

# సిఎం కార్యక్రమానికి ఆహ్వానించరా?

**ఎంపి ఈటెల రాజేందర్ ఆగ్రహం**



హైదరాబాద్,జూలై 13 : సిఎం రేవంత్ సమక్షంలోనే ప్రోటకాల్ విస్మరించడం దారుణమని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి జేఎన్టీయూలో పలు భవనాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదంటూ మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమంలో స్థానిక ఎంపీ అయిన తనకు ఆహ్వానం పంపకుండా అధికారులు ప్రోటోకాల్ విస్మరించారని మండిపడ్డారు. దీనిపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఉద్దేశ్య పూర్వకంగానే తనను పిలవకుండా అవమానిచారంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరనున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. కనీసం శిలాఫలకంలో అయినా తన పేరు ఉందో లేదోనంటూ ఎంపీ ఈటల రాజేందర్ ఆరా తీస్తున్నారు.

# ఆరు నెలల పాలన అధ్వాన్నం

**ఆరు గ్యారెంటీల అమలులో విఫలం.. కాంగ్రెస్ పాలనపై రఘునందన్ ఫైర్**

హైదరాబాద్,జూలై 13 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్ రావు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాడానికి గుప్పించిన ఆరు గ్యారంటీలు, ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల అమలు గురించి ప్రశ్నించారు.తన సోషల్ మీడియా పోస్ట్ లో రఘునందన్ రావు 'ఇవి గుర్తున్నాయా ఎవరికైనా?? రాష్ట్ర ప్రజలు లైనులో నిలబడి ఫామ్ నింపి ఆరు నెలలు అయింది. కానీ ఆరు గ్యారంటీలు మాత్రం అమలుకాలే!! పార్టీ ఫిరాయింపుల మీద ఉన్న శ్రద్ధ ఇచ్చిన హామీల మీద లేకపాయే!! ఇదేనా తెలంగాణలో ప్రజా పాలన అంటే??' అంటూ నిలదీశారు. ఇదిలావుండగా బిఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన ఎంఎల్ఏలు, ఎంఎల్సీలు ఒక్కొక్కరిగా కాంగ్రెస్ లోకి జంప్ అవుతున్నారు. అలా పార్టీ మారడం ఆగడం లేదని అన్నారు.

# ఆరు నెలల బాలుడిని కిడ్నాప్

**ఇద్దరు మహిళలతో పాటు సహకరించిన వ్యక్తి అరెస్ట్**

హైదరాబాద్,జూలై 13 : ఆరు నెలల బాలుడిని కిడ్నాప్ చేసిన ఇద్దరు మహిళలు, వారికి సహకరించిన మరో వ్యక్తిని మీర్‌చౌక్ పోలీసులు అరెస్టు చేశారు. డిసిపి స్నేహమెహ్రా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంఘారెడ్డి, పటాన్‌చెరువుకు చెందిన నస్రీన్ బేగం, నూర్జాహాన్ బేగం, మహ్మద్ ఆదిల్ కలిసి నేరాలు చేస్తున్నారు. ప్రధాన నిందితురాలు నస్రీన్ బేగం మిగతా ఇద్దరిని పిల్లలను కిడ్నాప్ చేయాలని, తాను షెల్టర్ ఇస్తానని చెప్పింది. ఈ క్రమంలోనే భార్య, భర్త నూర్జాహాన్, ఆదిల్ ఈ నెల 9వ తేదీన ఏపిలోని నెల్లూరు జిల్లాలోని బారాసాహెబ్ దర్గాను సందర్శించారు. అక్కడ నుంచి హైదరాబాద్‌కు బస్సులో వస్తుండగా నెల్లూరుకు చెందిన హబీబ్ ఉన్నీసా పరిచయం అయింది. ఆమెకు హైదరాబాద్‌లో నర్సు ఉద్యోగం ఇప్పిస్తామని ఇద్దరు చెప్పారు. వీరి మాటలు నమ్మిన బాధితురాలిని హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత ఎంజిబిఎస్ వద్ద ఉన్న సులబ్ కాంప్లెక్స్ వద్ద ఫ్రెష్‌అప్ కామ్మని లోపలికి పంపించి, ఆమె ఆరు నెలల కుమారుడిని పట్టుకున్నారు. బాధితురాలు లోపలికి వెళ్లి వచ్చే సరికి భార్యభర్త తన కుమారుడిని తీసుకుని పారిపోయారు. వెంటనే బాధితురాలు మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశారు. దర్యాప్తు చేసిన టీములు బాలుడిని పట్టుకుని సురక్షితంగా తల్లివద్దకు చేర్చారు. ఎస్సై అరుణోదయ్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఇటలీ నుంచి భారతీయ వలస కూలీలకు విముక్తి

రోమ్,జూలై 13 : రోజూ 10 నుంచి 12 గంటల పాటు పనిచేస్తున్న33 మంది భారతీయ వలస కూలీలకు ఇటలీ పోలీసులు విముక్తి కలిగించారు. వారు కేవలం గంటకు 4 యూరోల కోసం ఎంతో కష్టపడుతున్నారని తెలిసింది. వారంతా ఇటలీలోని ఉత్తర వెరోనా ప్రదేశంలో బానిసల్లా పనిచేస్తున్నారు. వారి విడుదలతో అక్కడి లేబర్ ఎక్స్ ఎ÷-లాయిటేషన్(శ్రమ దోపిడి) వెలుగు చూసింది. ఎక్కువ జీతం, బంగారు భవిష్యత్తు వంటి కల్లబొల్లి వాగ్దానాలతో, మోసపు ఎత్తుగడలతో వారిని గ్యాంగ్ మాస్టర్లు ఇటలీకి తీసుకెళ్లారని అక్కడి పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు డ్రగ్స్ చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు

**ప్రహరీ క్లబ్‌లతో అడ్డుకోవాలని నిర్ణయం**

హైదరాబాద్,జూలై 13 : రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో పాఠశాలల్ఓ చిన్నారులు డ్రగ్స్ బారిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లల్లో ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లు ఏర్పాటుచేయనున్నారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ ఉంటాడు. వైస్ ప్రెసిడెంట్ గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి క్లాసు లో ఇద్దరు విద్యార్థులు స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్.. పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్ లో సభ్యులుగా ఉంటారు. పిల్లలు మత్తు పదార్థాలుగా ఉపయోగించే ఔషధ మందులు, పదార్థాలు.. ఇతర రకాల వస్తువులు చేరకుండా నిరోధించడానికి ఈ క్లబ్ లు ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం త్వరలోనే పూర్తి గైడ్ లైన్స్ విడుదల చేయనుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 14
జూలై 2024





# సినీ నటులపై వ్యక్తిగత దాడి

**అసహ్యంగా విమర్శలతో ప్రసారాలు**

**యూ ట్యూబ్ ఛానెళ్లను మూసేయించిన' మా '**

హైదరాబాద్,జూలై 13 : నటులు, వారి కుటుంబ సభ్యులే లక్ష్యంగా వ్యక్తిగత విమర్శలు, అసత్య వార్తలను పోస్ట్ చేస్తున్న ఐదు యూట్యూబ్ ఛానళ్లను రద్దు చేయించినట్లు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ మా తెలిపింది. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్‌లో ఇలాంటి ఛానళ్లపై చర్యలు కొనసాగుతాయని ఎక్స్‌వేదికగా పోస్ట్ చేసింది. జస్ట్ వాచ్ బీబీసీ, ట్రోల్స్ రాజా, బచినా లలిత్, హైదరాబాద్ కుర్రాడు, ఎక్స్‌వైజెడ్ఎడిట్007 యూట్యూబ్ ఛానళ్లు రద్దు చేసిన జాబితాలో ఉన్నాయి. హీరోహీరోయిన్లను విమర్శిస్తూ చేసిన వీడియోలను, కామెంట్లను 48గంటల్లో తొలగించాలంటూ డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఇటీవల విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను డిలీట్ చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ఓ తండ్రి-కుమార్తెపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వీడియో పోస్ట్ చేసిన యూట్యూబర్లపై విష్ణు మండిపడ్డారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే ఊరుకోబోమన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'ట్రోలింగ్ వీడియోలు చేసే వారికి, అసభ్యకరమైన వీడియోలు చేసే వారికి ఒక 48 గంటలు మాత్రమే సమయం ఇస్తున్నా. దయచేసి అలాంటి వీడియోలన్నీ తక్షణమే తొలగించండి. ఒకవేళ మీరు తొలగించకపోతే సైబర్ సెక్యూరిటీకి ఫిర్యాదు చేస్తాం.అలాగే మీ యూట్యూబ్ ఛానళ్లు బ్యాన్ అయ్యేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ తరపున ఈ మేరకు మేము అప్పీల్ చేస్తున్నాం. సోషల్ మీడియాలో నటీనటుల మీద ట్రోలింగ్ వీడియోలు చేసినా, డార్క్ కామెడీ పేరుతో వీడియోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలను కోరుతున్నా అని మంచు విష్ణు వీడియోలో విజ్ఞప్తి చేశారు.

# ఇంద్రభవనంలా జగన్ ఇల్లు

**కంచె తొలగించడంతో ఆసక్తిగా చూస్తున్న జనం**

అమరావతి,జూలై 13 : అమరావతిలోని మాజీ సిఎం జగన్ ఇల్లు ఇప్పుడు టూరిస్ట్ స్పాట్‌గా మారింది. తెలంగాణలో ప్రగతి భవన్ ముందున్న ఇనుప కంచెను బద్దలు కొట్టినట్లు టిడిపి ప్రభుత్వం అటువైపు వెళ్లకుండా చేసిన అడ్డంకులను తొలగించింది. దీంతో ఇప్పుడు అంతా జగన్ ఇంటికి వెళ్లి సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఒకప్పుడు అటు వైపు చూడాలంటే అనుమతి ఉండేది కాదు. పొరపాటున అక్కడికి వెళ్తే పోలీసులు లాఠీలు ఝులిపించి, తరిమేసేవారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. అక్కడి పరిస్థితీ మారింది. సాధారణ ప్రజలూ అక్కడికి వెళ్లగలుగుతున్నారు. జగన్ ఇన్నాళ్లు అనుభవించిన రాజభోగాలను నలుగురితో పంచుకుంటున్నారు. కొందరు యువకులు రీల్స్ తీసి మరీ.. 'హాయ్ ఫ్రెండ్ ఇదే జగనన్న ఇల్లు. భారీ ఇనుప కంచె లోపలే జగన్ క్యాంపు కార్యాలయం' అంటూ అక్కడున్న సౌకర్యాలను వివరిస్తూ విస్తుపోతున్నారు. మరికొందరు సెల్ఫీలు తీసుకుంటున్నారు. మొత్తానికి స్వేచ్ఛ దొరికిన పక్షిలా ప్రజలు ఆ ప్రాంతంలో కలియదిరుగుతున్నారు. అక్కడున్న రోడ్లు, మొక్కలు చూసి ఆశ్చర్యపోతున్నారు. రాష్ట్రం అంతా గుంతల రోడ్లు ఉంటే ఇక్కడ మాత్రం నునుపుగా ఉన్నాయని చెప్పుకొంటున్నారు. ఇటీవల ఈ మార్గంలోకి ప్రజలను అనుమతిస్తూ బారికేడ్లు తొలగించడంతో ఔత్సాహికులు తరలివస్తున్నారు. ఐదేళ్లలో ఎంతో మారిపోయిందని, మొక్కలు ఉండాల్సిన చోట గతంలో పేదల గుడిసెలు ఉండేవని గుర్తు చేసుకుంటున్నారు. ఇక్కడి వీధి దీపాలూ ప్రత్యేకమైనవే. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఆ ఇంటికి ఏర్పాటు చేసుకున్న ప్రహరీ మరో ఎత్తు. సిమెంటు గోడపై 30 అడుగుల ఎత్తున ఇనుప ప్రహరీని ఏర్పాటు చేశారు. నిర్బంధం నుంచి విముక్తి అయిన ఆ ప్రాంతం ఇప్పుడు సెల్ఫీలు, రీల్స్, వీడియోలతో టూరిస్ట్ స్పాట్ అయ్యింది.

# కాంగ్రెస్ టిడిపికి తోక పార్టీనా

**నా విమర్శలు మీకు అలా కనిపించాయా**

**వైసిపి తీరుపైనా, వార్తా కథనాలపైనా షర్మిల ఫైర్**

విజయవాడ,జూలై 13 : పచ్చ కామెర్లోడికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుందనే సామెతలా ఉంది వైసీపీ నేతల తీరు ఉందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. 'తల్లికి వందనం' ఉత్తర్వులపై వచ్చిన వార్తకు చంద్రబాబు సమాధానం చెప్పాలని తాము అడిగామన్నారు. అయితే బాబుకి కాంగ్రెస్ తోక పార్టీ అని ముడిపెట్టడం వైసీపీ నేతల అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ట్విట్టర్ ద్వారా వైసీపీ నేతల విమర్శలకు వైఎస్ షర్మిల కౌంటర్ ఇచ్చారు. వైసీపీ నేతలకు కళ్లుండి, వినడానికి చెవులు ఉండి, విజ్ఞత కలిగిన వాళ్లే అయితే తాము చెప్పింది ఏంటో ఒకటికి 10 సార్లు వినాలని హితవు పలికారు. 'తల్లికి వందనం' జీవో 29 క్లారిటీ లేదని, సాక్షి రాసిన వార్తకి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ పథకం వర్తింపజేయాలని తాము డిమాండ్ చేస్తే కూటమి ప్రభుత్వానికి కొమ్ము గాసినట్లు ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. మేము నిన్న ప్రెస్ మీట్ పెట్టి నిలదీశాం కాబట్టే 24 గంటలు దాటకుండా సర్కారు ప్రజలకు వివరణ ఇచ్చుకుంది. ప్రతిపక్షంగా తల్లుల పక్షాన మేము నిలబడితే కాంగ్రెస్ బాబుకి తోక పార్టీ ఎలా అవుతుందని ప్రశ్నించారు. 2019 ఎన్నికల కంటే ముందు జగన్ ఇంట్లో ఇద్దరు బిడ్డలకు ఇస్తామని చెప్పలేదా? ఆ నినాదంతో నేను రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయలేదా? అది మీరు నిలబెట్టుకున్నారా? నిలువునా మోసం చేశారా? అది ప్రజలు మీకిచ్చిన తీర్పే చెబుతోంది. ఆ రోజు నా చేత ఊరూరా, ప్రతిచోటా ప్రచారం చేయించడం నిజం కాదా? నేను వైసీపీ కోసం బై బై బాబు క్యాంపెయిన్ చేయడం ఎంత నిజమో అమ్మ ఒడి కింద ఇద్దరు బిడ్డలకు రూ.15000 చొప్పున, ప్రతి తల్లికి ఇస్తామని ప్రచారం చేయడం కూడా అంతే నిజం. మరి మీకు రూ.15000 ప్రతిబిడ్డకు ఇచ్చే ఉద్దేశమే లేకపోతే నా చేత ఎందుకు అలా ప్రచారం చేయించారు? మీరు కూడా ఎందుకు క్యాంయిన్ చేశారు? సంపూర్ణ మద్యపాన నిషేధం, జలయజ్ఞం పూర్తి చేస్తాం, ప్రత్యేక హోదా సాధిస్తాం అని ఎందుకు క్యాంపెయిన్ చేయించారు? మీరు కూడా ఎందుకు క్యాంపెయిన్ చేశారు? బహిరంగ చర్చకు మీరు సిద్ధమా' అని షర్మిల సవాల్ విసిరారు.

# నగరంలో మరో భారీ మోసం

**ఉద్యోగాల పేరుతో వసూళ్లు.. బోర్డు తిప్పేసిన జాగృతి కన్సల్టెన్సీ**

హైదరాబాద్,జూలై 13 : హైదరాబాద్ నగరంలో మరో భారీ మోసం బయటపడింది.ఈమధ్య కాలంలో కొందరు దుండగులు నిరుద్యోగుల్ని టార్గెట్ చేసుకొని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. మంచి జీతాలిచ్చే పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ శఠగోపం పెడుతున్నారు. వారిని నమ్మించేందుకు.. ఫేక్ కంపెనీలను సైతం సృష్టిస్తున్నారు. తీరా తమ చేతికి డబ్బులందాక.. బోర్డు తిప్పేస్తున్నారు. ఇప్పుడు ఇలాంటి మోసమే తాజాగా హైదరాబాద్‌లో వెలుగు చూసింది. ఉద్యోగాల పేరుతో యువత నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి, ఓ కన్‌స్టలెన్సీ సంస్థ బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. జూబ్లీహిల్స్ లో జాగృతి కన్‌స్టలెన్సీ పేరుతో ఓ ఐటీ కంపెనీ ఉంది. ఉద్యోగాలు ఇస్తాం.. ఉద్యోగాలు ఇప్పిస్తాం అంటూ భారీ ఎత్తున డిజిటల్ అండ్ సోషల్ మీడియాలో ప్రచారం చేసింది. నమ్మిన నిరుద్యోగులు కంపెనీకి పోటెత్తారు. ఇక్కడే తన కుట్రను అమలు చేసింది జాగృతి కన్‌స్టలెన్సీ.ఉద్యోగం ఊరికే రాదు.. 2 లక్షల రూపాయల డిపాజిట్ చేయాలని కండీషన్ పెట్టింది. ఐటీ కంపెనీ.. ఐటీ కంపెనీలో ఉద్యోగం కదా అని.. 12 వందల మంది నిరుద్యోగులు.. తలా 2 లక్షల రూపాయలు కట్టారు. 2 లక్షలు కట్టినోళ్లకు ఫేక్ ఆఫర్ లెటర్స్ తో ఉద్యోగాలు ఇచ్చింది.. ఆఫీసుల్లో సీట్లు కూడా ఏర్పాటు చేసింది. కాకపోతే జీతాలు మాత్రమే ఇవ్వలేదు.. మూడు నెలలుగా జీతాలు ఇవ్వక పోవటంతో కంపెనీని నిలదీశారు ఉద్యోగులు. జీతాలు అయినా ఇవ్వండి లేదంటే మేం కట్టిన 2 లక్షల రూపాయలు అయినా తిరిగి ఇవ్వండి అంటూ డిమాండ్ చేశారు. పరిస్థితులు చేయిదాటి పోవటంతో.. రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసింది జూబ్లీహిల్స్ లోని జాగృతి కన్‌స్టలెన్సీ. మొత్తం 12 వందల మంది నుంచి 24 కోట్ల రూపాయలను జాగృతి కన్‌స్టలెన్సీ డైరెక్టర్ జగదీశ్ వసూలు చేసినట్లు చెబుతున్నారు బాధిత నిరుద్యోగులు. ఇప్పుడు ఆఫీసుకు తాళాలు వేసి వెళ్లిపోయారని.. కంపెనీ మోసం చేసిందంటూ పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు. కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లో జాగృతి కన్‌స్టలెన్సీ పేరుతో ఒక ప్రైవేట్ కంపెనీ వెలిసింది. ఈ సంస్థకు ఆకుల జగదీశ్ అనే వ్యక్తి డైరెక్టర్. తమకు రూ.2 లక్షలు చెల్లిస్తే చాలు.. తామే ట్రైనింగ్ ఇప్పించి, మంచి జీతాలు ఇచ్చే సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆ కంపెనీ నమ్మించింది. ఆ ఆఫీస్ చూడ్డానికి ఎంతో అట్రాక్టివ్‌గా ఉండటం, కొందరు ఉద్యోగులు కూడా ఉండటం చూసి.. నిరుద్యోగులు ఎగబడ్డారు. వాళ్లు చెప్పినట్లేగానే రూ.2 లక్షలు ఇచ్చారు. ఇలా మొత్తం 1200 మంది నుంచి రూ.2 లక్షలు చొప్పున.. రూ. 24 కోట్ల వరకూ వసూలు చేసింది. అయితే.. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, ఆ సంస్థలో పని చేసే ఉద్యోగులగూ జీతాలు ఇవ్వకపోవడంతో.. అందరూ ప్రశ్నించడం మొదలుపెట్టారు.ఇప్పుడు ఆ కంపెనీ బోర్డు తిప్పేసింది. అందులో పని చేసే ఉద్యోగులతో పాటు డబ్బులిచ్చిన నిరుద్యోగులు ఆ కంపెనీ వద్దకు వెళ్ల చూడగా.. దానికి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో తాము మోసపోయామని గ్రహించి.. బాధితులు లబోదిబోమంటూ రోదిస్తున్నారు. పోలీసులను ఆశ్రయించి, తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో.. ఈ వ్యవహారంపై అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న జాగృతి కన్‌స్టలెంట్ డైరెక్టర్ జగదీశ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో.. ఇలాంటి మోసపూరిత సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుడ్డిగా డబ్బులు ఇవ్వొద్దని సూచిస్తున్నారు.

# కాళ్లకు దండం పెట్టే సంస్కృతి పోవాలి: చంద్రబాబు

అమరావతి,జూలై 13 : కాళ్లకు దండం పెట్టే సంస్కృతి వీడాలని సీఎం చంద్రబాబు తెలిపారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్ చేశారు. 'ఎవరైనా నా కాళ్లకు దండం పెడితే, వారి కాళ్లకు నేను దండం పెడతా. ఇవాళ్టి నుంచి నా కాళ్లకు దండం పెట్టే విధానానికి ఫుల్‌స్టాప్ పెడుతున్నా. తల్లిదండ్రులు, భగవంతుడి కాళ్లకు దండం పెట్టాలి తప్ప నాయకులకు కాదు. నాయకుల కాళ్లకు దండం పెట్టి ఎవరూ తమ గౌరవాన్ని తగ్గించుకోవద్దు. నాయకుల కాళ్లకు ప్రజలు, పార్టీ శ్రేణులు దండం పెట్టొద్దనే సంస్కృతి నా నుంచే ప్రారంభిస్తున్నా' అని సీఎం చంద్రబాబు తెలిపారు. అనంతరం ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు.

# రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య

**ప్రతి జిల్లాకు ఇక ఎసి బస్సు సర్వీసులు... నల్లగొండలో బస్ సర్వీసులు ప్రారంభించిన పొన్నం**

నల్గొండ,జూలై 13 : రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన బస్సులను ప్రారంభించారు. నల్గొండ-హైదరాబాద్ మధ్య నాన్‌స్టాప్ ఏసీ, 3 డీలక్స్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కొత్తగా 1000 బస్సులు కొన్నామని, మరో 1500 బస్సులకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. దసరా లోపు నల్గొండ జిల్లాకు 30 ఎక్స్‌ప్రెస్, 30 లగ్జరీ బస్సులు ఇస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం డీఏ ఇచ్చామన్నారు. రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన రూ.200 కోట్లను నెలాఖరులోగా చెల్లిస్తామని తెలిపారు. ఆర్టీసీలో 3,035 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం నుంచి లగ్జరీ బస్సులు నడుపుతామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల నుంచి ఏసీ బస్సులు ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. త్వరలో నల్గొండ జిల్లాకు మరిన్ని బస్సులు తెస్తామన్నారు. కొత్త బస్సుల్లో నల్గొండకు 100 కేటాయించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.








# మంచి చేయాలనుకునే వారికి స్వాగతం

**ఎపిలో అంతా కలసి అభివృద్ధి చేసుకుందాం**

**సేవ చేసేందుకే భగవంతుడు పునర్జన్మ ఇచ్చాడు**

**కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రంలో చంద్రబాబు**



అమరావతి,జూలై 13 : మంచి చేయాలనుకునేవారికి ఇక స్పీడ్ బ్రేకర్లు ఉండవని సీఎం చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రంలో నిర్వహించిన అనంతశేష స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేంకటేశ్వర ఆలయ నిర్మాణంలో భాగంగా ఇక్కడ అనంతశేష స్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'మంచి చేసే వారందరికీ ఆంధ్రప్రదేశ్ చిరునామాగా ఉంటుంది. మంచి చేసే వారంతా ఏపీలో ఇక ముందుకు రావాలి. అక్షయపాత్ర స్ఫూర్తితో అతి త్వరలో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభిస్తాం. హరేకృష్ణ సంస్థ దైవసేవతో పాటు మానవ సేవను సమానంగా చేస్తోంది. ఆధ్యాత్మికత ద్వారా వచ్చే మానసిక ఆనందం లేకపోతే ముందుకెళ్లలేం అన్నారు. దైవత్వాన్ని అందరిలో పెంపొందించేలా అక్షయ పాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధుపండిత్ కృషి చేస్తున్నారు. 50 మంది ఐఐటీ పట్టభద్రులు సేవా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయం. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ఆధ్యాత్మిక సేవలనూ కొనసాగించాలి. వేంకటేశ్వరస్వామి దయతోనే బాంబు పేలుళ్ల నుంచి బయటపడ్డానని ఈ సందర్భంగా చంద్రబాబు అన్నారు. పేదరిక నిర్మూలన నినాదమే తన లక్ష్యమన్నారు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు. ప్రభుత్వంతోపాటు ఇలాంటి స్వచ్ఛంద సంస్థల సహాయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తామన్నారు. సమాజానికి ఇంకా ఏదో చేయాలనే ఉద్దేశ్యంతోనే తిరుమల వెంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. తాను నమ్మేదేవుడు, ప్రార్థించే దేవుడు వేంకటేశ్వర స్వామి అని మరోసారి తెలిపారు. 2003లో తనపై 23 క్లైమోర్ మైన్స్ బాంబు బ్లాస్ట్ చేయాలని ప్లాన్ చేశారు. అప్పుడు తన ప్రాణాలను కాపాడింది తిరుమల వేంకటేశ్వరుడని గతాన్ని గుర్తు చేశారు. ఆది ఒక మిస్టరీ అని చెప్పారు.ప్రపంచానికి సేవలందించే అవకాశం కోసమే నాకు తిరిగి ప్రాణభిక్ష పెట్టారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే అందరి నినాదం కావాలి. అక్షయపాత్ర ద్వారా ప్రతిరోజు 22 లక్షల మందికి భోజనం పెడుతున్నారు. అన్న క్యాంటీన్లను చిన్న ఫిర్యాదు లేకుండా అక్షయపాత్ర నిర్వహించిందని చంద్రబాబు తెలిపారు. హరేకృష్ణ సంస్థకు అన్నదానానికి దాతలు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాస్‌రాజు రూ.కోటి విరాళం అందజేశారు. పూర్ టు రిచ్ స్ఫూర్తితో వంద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు చెప్పారు. హరేకృష్ణ సంస్థకు సక్కు గ్రూపు రూ.కోటి విరాళం, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూపు రూ.కోటి విరాళం అందించాయి. శ్రీనివాస్‌రాజు, కృష్ణమోహన్, సక్కు గ్రూప్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల ధరలు పెరిగాయని తెలిపారు. రాజధాని అమరావతిలోని కొలనుకొండలో హరేకృష్ణ గోకుల క్షేత్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు సందర్శించి పూజలు చేశారు. గర్భాలయంలో నిర్వహించిన అనంతశేష స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేంకటేశ్వర ఆలయ నిర్మాణంలో భాగంగా ఇక్కడ అనంతశేష స్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ పాల్గొన్నారు. అక్షయ పాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధుపండిత్, మంత్రులు నారాయణ, సవిత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మారింది...పనులు జాగ్రత్తగా చేయండి

**పాలకొల్లు ఆస్పత్రి నిర్మాణాలు**

**పరిశీలించిన మంత్రి నిమ్మల**

భీమవరం,జూలై 13 : కూటమి ప్రభుత్వంలో పనులన్నీ నాణ్యతగా జరగాల్సిందేనని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. కొత్తగా చేపట్టిన భవన నిర్మాణ పనుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శ్లాబ్ నుంచి లీకవుతున్న వర్షపునీరు, నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. 'మీ ఇళ్ల నిర్మాణాలు ఇలాగే ఉంటాయా?' అంటూ అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పనులన్నీ నాణ్యతగా జరగాల్సిందే నన్నారు. అనంతరం పాత ఆస్పత్రిలో రోగుల సమస్యలను మంత్రి నిమ్మల అడిగి తెలుసుకున్నారు. జగన్ ఐదేళ్ల విధ్వంసం ఆస్పత్రి నూతన భవన నిర్మాణాల్లోనూ కళ్లారా కనిపించిందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఏడాదిలో పూర్తి కావాల్సిన పనులు ఐదే÷-ళ్లలైనా వైకాపా ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. పనుల పరిస్థితిని కలెక్టర్, వైద్యారోగ్య శాఖ కమిషనర్‌కు ఆయన ఫోనులో వివరించారు. సకాలంలో మిగిలిన పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. అంతకుముందు మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం నరసాపురంలో పర్యటించారు. ముందుగా పట్టణంలోని హోటల్‌లో మంత్రి నిమ్మల రామానాయుడు సాధారణ మనిషిలా శనివారం టిఫిన్ చేశారు. పాలకొల్లు నుండి విజయవాడకు వెళుతుండగా, మార్గమధ్యంలోని నరసాపురం తేజ టిఫిన్ సెంటర్లో కారు ఆపి టిఫిన్ చేశారు. ఆయన రాకతో హోటల్ లో ఉన్న చుట్టుపక్కల ప్రజలు ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలోనే పాలకొల్లులో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణానికి ముందే వర్షపునీరు నిల్వ ఉండటాన్ని చూశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ. 12.60 కోట్లతో గత ప్రభుత్వంలో చేపట్టిన కొత్త భవన నిర్మాణ పనుల అస్తవ్యస్త తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన స్లాబ్ నుంచి లీకేజ్ అవుతున్న వర్షం నీరు, పలుచోట్ల నిల్వ ఉన్న నీరు పరిస్థితులను స్వయంగా చూసిన మంత్రి మీ ఇంటి నిర్మాణాలు ఇదేవిధంగా ఉంటాయా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం మారిందని పనులన్నీ నాణ్యతతో సవ్యంగా జరగాలని ఆదేశించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పాత ఆస్పత్రిలో బాలింతలను పలకరించి శిశువులను ఎత్తుకుని ముద్దాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. జగన్ 5 ఏళ్ల విధ్వంసం.. అమరావతి, పోలవరంలోనే కాదు, పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనుల్లోనూ కనిపిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా జరిగాయని మంత్రి నిమ్మల ఆరోపించారు. ప్రారంభానికి నోచుకోకుండానే స్లాబ్ నుంచి వర్షపు నీరు లీకేజీ, నీరు నిల్వ వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో వంద పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచి కొత్త భవనానికి రూ. 12.60 కోట్లు మంజూరు చేయించినట్లు మంత్రి చెప్పారు. ఏడాది కాలంలో పూర్తి కావాల్సిన పనులు వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గడిచిన నేటికీ ప్రారంభం కాలేదు అన్నారు. పనుల పరిస్థితి పై మంత్రి రామానాయుడు ఫోన్ చేసి జిల్లా కలెక్టర్, ఆరోగ్య, వైద్యశాఖ కమిషనర్ దృష్టికి వివరాలను తీసుకెళ్లారు.

# 35 లక్షల విలువైన క్వింటాల్నర గంజాయి పట్టివేత

నల్లగొండ,జూలై 13 : జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో రూ. 35 లక్షల విలువ గల 1 క్వింటాల్నర గంజాయిని పట్టుకున్నారు. ఈ సంధర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూనవత్ జగన్ అనే వ్యక్తి ని అరెస్ట్ చేశామని చెప్పారు. రెండు కార్లు స్వాదీనం చేసుకున్నామన్నారు. మరో నలుగురు నిందితులు పరారిలో ఉన్నారని తెలిపారు. నూనావత్ మంచ్యా నాయక్, ఆంగోతు నాగరాజు,బాణోతు సాయి, భూక్యా రాము కోసం పోలీస్ టీం వెతుకుతున్నారని తెలిపారు. జిల్లా పై నిరంతర నిఘా పెట్టామని గంజాయి లాంటి మాధకద్రవ్యాలు తెస్తే కఠినంగా ఉంటామని చెప్పారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

# అపార్ట్‌మెంట్ నుంచి దూకి యువతి ఆత్మహత్య

హైదరాబాద్,జూలై 13 : హైదరాబాద్‌లో దారుణం జరిగింది. మియాపూర్ జనప్రియ అపార్ట్ మెంట్ పై నుండి ఓ యువతి దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జనప్రియ అపార్ట్ మెంట్ లో నివసాం ఉంటున్న 25 ఏళ్ల శృతి పై అంతస్తు నుంచి కిందకు దూకింది. దీంతో తీవ్ర రక్త స్రవంతో యువతి కొట్టిమిట్టాడింది. స్థానికులు యువతిని గమనించి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి తీసుకెళ్లే క్రమంలోనే శృతి మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రికి చేరుకున్న పోలీసులు యువతి మృతిపై కేసు నమోదు చేసుకున్నారు. డిప్రెషన్ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# లావణ్యకు రోణ కల్పించండి

**డిజిపిని కలిసి కోరిన లాయర్**

హైదరాబాద్,జూలై 13 : హీరో రాజ్ తరుణ్, లావణ్య కేసులో న్యాయవాది డీజిపిని కలిసారు . ఆత్మహత్య చేసుకుంటానని జూలై 12న రాత్రి న్యాయవాది రాజేష్ కు మెసేజ్ చేసింది లావణ్య. దీంతో లావణ్యకు రక్షణ కల్పించాలని ఆమె తరపు న్యాయవాది రాజేష్ డీజీపీని కోరారు. గత అర్ధరాత్రి లావణ్య కాల్ చేసి కేసుకు సంబంధించి కొన్ని ప్రశ్నలు అడిగింది. రాజ్ తరుణ్ అరెస్ట్ అవుతాడా, నన్ను పెళ్లి చేసుకుంటాడా, నా పై దాడి చేస్తాడా అని అడిగింది. మరో అరగంట తర్వాత నేను ఉండలేను అంటూ మెసేజ్ చేసింది. వెంటనే 100 కి డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాను. వెంటనే పోలీసులు ఆమెను రిస్క్యూ చేసి కాపాడారు. లావణ్యను స్టేట్ హోమ్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వాలని డీజీపీని ఆమె న్యాయవాది కోరారు. ఈ లోకంలో నా పయనం పూర్తి చేసాను. అందుకే ఈ లోకం నుండి వెళ్లిపోతున్నాను. నేను ఏంటో తెలిసిన మనుషులే నన్ను తప్పు బట్టారు .నేను ఎవరో తెలియని వాళ్లు నా వెంట నిలిచారు. రాజ్‌తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాను. నేను నమ్మిన వారే నన్ను మోసం చేశారు .మైండ్ గేమ్, గాసిప్స్‌తో విసిగిపోయాను. మస్తాన్ కేసులో నేను కీలు బొమ్మను అయ్యాను. ప్రతిదీ ఒక పథకం ప్రకారం జరిగింది. నా భర్త నాకు కావాలని మాల్విని బతిమలాడాను.. కానీ మాల్వి నిపించుకోలేదు. నా చావుకు కారణం రాజ్‌తరుణ్, అతని తల్లిదండ్రులే.నా చావుకు ప్రధాన కారకురాలు మాల్వీ మల్హోత్రా. నాకు తినడానికి తిండి లేదని మెత్తుకుంటున్నా. రాజ్‌తరుణ్‌తో మాల్వీ మల్హోత్రా ఎంజాయ్ చేస్తోంది. రాజ్‌తరుణ్, మాల్వీ మోజులో పడి మారిపోయాడు. రాజ్‌తరుణ్ నా మరణాన్ని కోరుకుంటున్నాడు అని లావణ్య సూసైడ్ నోట్ లో ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 14
జూలై 2024




# కుర్రాళ్లు కదంతొక్కారు!

## అర్ధసెంచరీలతో మెరిసిన జైస్వాల్, గిల్

## జింబాబ్వేపై భారత్ ఘన విజయం

## 3-1తో టీ20 సిరీస్ కైవసం

## నేడు ఇరు జట్ల మధ్య ఐదో టీ20

**కుర్రాళ్లు కదంతొక్కారు! సీనియర్ల గైర్హాజరీలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ జింబాబ్వేతో మరో మ్యాచ్ మిగిలుండగానే టీ20 సిరీస్‌ను ఒడిసిపట్టుకున్నారు. ఏకపక్షంగా సాగిన నాలుగో టీ20 పోరులో టీమ్ఇండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జింబాబ్వే నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని యువభారత్ వికెట్ కోల్పోకుండా 16వ ఓవర్‌లోనే విజయాన్నందుకుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో విజృంభిస్తే..గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తొలుత బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో జింబాబ్వే 152 పరుగులు చేసింది. సిరీస్‌లో ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో టీ20 మ్యాచ్ నేడు జరుగనుంది.**




హరారే: జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ తమ ఖాతాలో వేసుకుంది. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌లో టీమ్ఇండియా 3-1తో ఆధిక్యంలో నిలిచింది. శనివారం జరిగిన నాలుగో టీ20లో భారత్ 10 వికెట్ల తేడాతో జింబాబ్వేపై భారీ విజయం సాధించింది. తొలుత జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ సికిందర్ రజా(46) టాప్ స్కోరర్‌గా నిలువగా, మరుమని(32) ఆకట్టుకున్నాడు. ఖలీల్ అహ్మద్(2/32) రెండు వికెట్లు తీయగా, దేశ్‌పాండే, సుందర్, అభిషేక్, దూబె ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీమ్ఇండియా 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా విజయాన్నందుకుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(53 బంతుల్లో 93 నాటౌట్, 13ఫోర్లు, 2సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్(39 బంతుల్లో 58 నాటౌట్, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో విజృంభించారు. పసలేని జింబాబ్వే బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ ఈ యువ ద్వయం జట్టుకు అలవోక విజయాన్ని అందించారు. ముఖ్యంగా ఆకాశమే హద్దుగా చెలరేగిన జైస్వాల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**జైస్వాల్, గిల్ ధనాధన్:**

జింబాబ్వే నిర్దేశించిన లక్ష్యఛేదనలో యువ ఓపెనర్లు జైస్వాల్, గిల్ ఆది నుంచే తమదైన దూకుడు కనబరిచారు. గరవ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే జైస్వాల్ మూడు ఫోర్లతో దంచుడు మొదలుపెట్టాడు. ఆ తర్వాత తన వంతు అన్నట్లు గిల్ కూడా బ్యాటుకు పనిచెప్పాడు. చతార వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో జైస్వాల్ చుక్కలు చూపెట్టాడు. నాలుగు ఫోర్లు 16 పరుగులు పిండుకున్నాడు. దీంతో నాలుగో ఓవర్‌లోనే టీమ్ఇండియా 50 పరుగుల మార్క్ అందుకుంది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 61 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన కెప్టెన్ రజాను కూడా జైస్వాల్ అరుసుకున్నాడు. ఈ క్రమంలో 29 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఏ దశలోనూ వెనుకకు తగ్గని ఈ జోడీ బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా ముందుకు సాగింది. ఫరజ్ అక్రమ్ వేసిన 10వ ఓవర్‌లో గిల్ మూడు ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్‌ను టాప్‌గేర్‌లో తీసుకెళ్లాడు. వీరిద్దరిని విడదీసేందుకు కెప్టెన్ రజా ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. వీరి దూకుడైన బ్యాటింగ్‌తో లక్ష్యం అంతకంతకూ కరుగుతూ వచ్చింది. ఆఖర్లో మ-ంజరబనీ బౌలింగ్‌లో ఫోర్‌తో జైస్వాల్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు.

**రజా మెరిసినా:**

తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేకు మెరుగైన శుభారంభం దక్కింది. ఓపెనర్లు వెస్లి మెద్వెరె(25), మ-రుమని(32) టీమ్ఇండియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఖలీల్ అహ్మద్ మూడో ఓవర్‌లో మ-రుమని ఇచ్చిన దూబే జారవిడువడంతో బతికిపోయాడు. ఇదే అదనుగా చెలరేగడంతో జింబాబ్వే తొలి ఆరు ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. టీ20ల్లో భారత్‌పై తొలి వికెట్‌కు జింబాబ్వే అత్యుత్తమ భాగస్వామ్యాన్ని నమోదు చేసుకుంది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని మరుమనిని ఔట్ చేయడం ద్వారా అభిషేక్ విడగొట్టాడు. మరో ఎండ్‌లో బౌలింగ్‌కు వచ్చిన దూబే..వెస్లీని ఔట్ చేసి భారత్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఇన్నింగ్స్ బాధ్యతను రజా తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో రెండు వేల పరుగుల మార్క్ దాటేసిన రజా..టీమ్ఇండియా బౌలర్లను నిలువరించాడు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..రజా వెనుకకు తగ్గలేదు. చివరకు దేశ్‌పాండే బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఖలీల్ 20వ ఓవర్‌లో రెండు వికెట్లు తీసి ఐదు పరుగులకే పరిమితం కావడంతో జింబాబ్వే ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**సంక్షిప్త స్కోర్లు**

**జింబాబ్వే: 20 ఓవర్లలో 152/7 (రజా 46, మరుమని 32, ఖలీల్ 2/32, అభిషేక్ 1/20),**
**భారత్: 15.2 ఓవర్లలో 156/0 (జైస్వాల్ 93 నాటౌట్, గిల్ 58 నాటౌట్)**

# విరాట్‌ను ఔట్ చేయడం అసాధ్యం

## ఇంగ్లండ్ పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్



క్రికెట్?లో ఒక శకం ముగిసింది. ఇంగ్లండ్ పేస్ దిగ్గజం జేమ్స్ అండర్సన్ జెంటిల్మన్ గేమ్?కు గుడ్? బై చెప్పేశాడు. 21 ఏళ్ల పాటు నిఖార్సయిన పేస్ బౌలింగ్?తో అభిమానుల్ని ఉర్రూతలూగించిన జిమ్మీ ఇక మీదట క్రికెట్? ఫీల్డ్?లో కనిపించడు. ఈతరం చూసిన బెస్ట్ ఫాస్ట్ బౌలర్స్?లో అండర్సన్? టాప్?లో ఉంటాడు. అన్ని ఫార్మాట్లలోనూ అద్భుతంగా రాణించిన అతడు.. టెస్ట్ స్పెషలిస్ట్?గా పేరు తెచ్చుకున్నాడు. సుదీర్ఘ కెరీర్?లో ఏకంగా 188 టెస్టుల్లో 704 వికెట్లు తీసి గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్?గా నిలిచాడు. ఒక పేస్ బౌలర్ అన్ని వికెట్లు తీస్తాడని ఎవరూ ఊహించలేదు. గాయాలతో సావాసం చేసే సీమర్స్ రెండు దశాబ్దాలకు పైగా కంటిన్యూ అవడం అంటే అదో మ్యాజిక్ అనే చెప్పాలి. ఓవరాల్? కెరీర్?లో 40 వేల బంతులు వేయడం మరో హైలైట్. 147 ఏళ్ల క్రికెట్ హిస్టరీలో ఒక బౌలర్ 40 వేల బంతుల మార్క్?ను అందుకోవడం ఇదే ఫస్ట్ టైమ్. వెస్టిండీస్?తో జరిగిన లార్డ్స్ టెస్ట్?తో కెరీర్?కు గుడ్?బై చెప్పిన జిమ్మీ.. ఈ మ్యాచ్?లో 4 వికెట్లు పడగొట్టాడు. సెకండ్ ఇన్నింగ్స్?లో 3 వికెట్లు తీసి విండీస్? పతనాన్ని శాసించాడు. పోతూ పోతూ ఓ సూపర్ డెలివరీ వేశాడు. అద్భుతమైన ఇన్?స్వింగర్? వేసి బ్యాటర్?ను క్లీన్?బౌల్డ్ చేశాడు. అండర్సన్?కు ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఇంగ్లండ్ ఫ్యాన్స్ భారీగా లార్డ్స్?కు తరలివచ్చారు. ఆఖరుగా డ్రెస్సింగ్ రూమ్?లో షాంపేన్ తాగి వాళ్లకు చీర్స్ చెప్పాడు అండర్సన్. ఇన్నేళ్ల కెరీర్?లో ఎంతో మందితో కలసి ఆడిన ఈ ఇంగ్లీష్ సీమర్.. టీమిండియా కింగ్ విరాట్ కోహ్లీ అంటే మాత్రం తనకు భయమని అంటున్నాడు. అతడ్ని ఎక్కువ సార్లు ఔట్ చేయలేకపోయాననే బాధ తనను వెంటాడుతోందని చెప్పాడు. 'ఏ ప్లేయర్ కెరీర్?లో అయినా ఎత్తుపల్లాలు ఉంటాయి. కొన్ని సిరీస్?ల్లో బాగా ఆడాననే ఫీలింగ్ ఉంటుంది. ఇంకొన్ని సిరీస్?ల్లో బ్యాటర్లు నా బౌలింగ్?లో ఈజీగా రన్స్ చేశారని అనిపిస్తుంది. విరాట్ కోహ్లీని కెరీర్ స్టార్టింగ్? టైమ్?లో చాలామార్లు అలవోకగా ఔట్ చేశా. ప్రతి బాల్?కు అతడ్ని ఔట్ చేస్తానని అనిపించేది. కానీ ఈ మధ్య కాలంలో పరిస్థితి మారిపోయింది. విరాట్?ను ఔట్ చేయడం అసాధ్యంగా మారింది. అది నన్ను న్యూనతకు గురిచేసింది. అతడ్ని ఎక్కువ సార్లు ఔట్ చేయలేకపోయాననే బాధ ఉంది' అని అండర్సన్ చెప్పుకొచ్చాడు. తాను బౌలింగ్ చేసిన వారిలో బెస్ట్ బ్యాటర్?గా మాస్టర్?బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరు చెప్పాడు జిమ్మీ. సచిన్ బ్యాటింగ్?కు వచ్చిన ప్రతిసారి అతడికి చెత్త బాల్ వేయొద్దని ఆలోచనతోనే ఆడేవాడ్నని గుర్తుచేసుకున్నాడు. ఎంత బాగా వేసినా సచిన్ పరుగులు రాబట్టేవాడంటూ మెచ్చుకున్నాడు. మరి.. కోహ్లీ-సచిన్? మీద అండర్సన్ చేసిన వ్యాఖ్యలపై మీ ఒపీనియన్?ను కామెంట్ చేయండి.

# ప్రపంచ రికార్డును బద్దలు కొట్టగల సత్తా వారికే ఉంది

## వెస్టిండీస్ మాజీ క్రికెటర్ బ్రియాన్ లారా

టెస్టు క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్రపంచ రికార్డు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ బ్రియాన్ లారా పేరిట ఉంది. టెస్టు క్రికెట్‌లో 400 పరుగుల మ్యాజికల్ ఫిగర్‌ను తాకిన ఏకైక బ్యాట్స్‌మెన్ బ్రియాన్ లారా. ఈ అనుభవజ్ఞుడైన కరేబియన్ క్రికెటర్.. ఈ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టగల నలుగురు క్రికెటర్లు ఎవరో చెప్పాడు. 2004లో సెయింట్ జాన్స్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగిన హోమ్ టెస్ట్ సిరీస్‌లో లారా ఈ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్ డ్రాగా ముగియగా.. బ్రియాన్ లారా 400 పరుగులు చేసిన తర్వాత నాటౌట్‌గా వెనుదిరిగాడు. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లకు 751 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసినప్పుడు. లారా 400 పరుగులతో నాటౌట్ గా ఉన్నాడు. లారా 582 బంతుల్లో 43 ఫోర్లు, నాలుగు సిక్సర్ల సాయంతో ఈ పరుగులు చేశాడు. లారా పేరిట ఉన్న ఈ ప్రపంచ రికార్డును శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే మాత్రమే చేరుకోగలిగాడు. 2006లో దక్షిణాఫ్రికాపై జయవర్ధనే 374 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. డైలీ మెయిల్ ప్రకారం.. బ్రియాన్ లారా తన ప్రపంచ రికార్డును బ్రేక్ చేసే ఆటగాళ్లు ఎవరు అని అడగ్గా.. అతను చెప్పిన పేర్లలో ఇద్దరు భారతీయ క్రికెటర్లు ఉన్నారు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, హ్యారీ బ్రూక్, జాక్ క్రౌలీ లాంటి ఆటగాళ్లు.. తన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టగలరని లారా తెలిపాడు. అయితే.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ బ్యాట్స్‌మెన్‌ల పేర్లను లారా చెప్పలేదు. లారా ప్రపంచంలోని ఆల్ టైమ్ గొప్ప బ్యాట్స్‌మెన్. అతను 131 టెస్టులు, 299 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. టెస్ట్ ల్లో 11953, వన్డేల్లో10405 పరుగులు చేశాడు. లారా తన కెరీర్‌లో మొత్తం 34 టెస్టులు, 19 వన్డేల్లో సెంచరీలు సాధించాడు. 55 ఏళ్ల లారా 2006లో తన కెరీర్‌లో చివరి టెస్టు మ్యాచ్ ఆడాడు. 2007లో చివరి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు.

# ఛాంపియన్ ట్రోఫీపై సందిగ్ధత

## పాక్‌కు వెళ్లే విషయంలో తొలగని అనిశ్చితి

న్యూఢిల్లీ,జూలై13 : వచ్చే ఏడాదిలో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వనున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే.. తాము పాకిస్తాన్‌లో అడుగుపెట్టమని, టీమిండియా మ్యాచ్‌లను హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని బీసీసీఐ తేల్చి చెప్పింది. నిజానికి.. పాకిస్తాన్‌కు రప్పించాలన్న ఉద్దేశంతో, భారత జట్టుకి ఏకైక వేదికగా లాహోర్‌ని ఎంపిక చేసింది. ఆటగాళ్లకు తాము భద్రత కల్పిస్తామని, అందులో ఏమాత్రం లోటు ఉండదని హామీ ఇచ్చింది కూడా! అయినప్పటికీ బీసీసీఐ నుంచి ఆమోదం లభించలేదు. భారత్ మ్యాచ్‌ల కోసం దుబాయ్ లేదా శ్రీలంకలో ఏదో ఒక వేదికన్ని ÷నైల్ చేయాలని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనపై ఇంకా అధికారిక చర్చ జరగాల్సి ఉంది. మరోవైపు.. బీసీసీఐ డిమాండ్లను పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు (పీసీబీ) అంగీకరించడం తప్ప మరో మార్గం లేదు. ఒకవేళ.. భారత్ చేసిన ఈ ప్రతిపాదనని అంగీకరించకుండా, పాక్‌లోనే అన్ని మ్యాచ్‌లను నిర్వహించాలని పీసీబీ పట్టుబడితే మాత్రం పరిస్థితులు మరోలా ఉంటాయి. భద్రతా కారణాల దృష్ట్యా భారత జట్టు ఈ టోర్నీ నుంచి వైదొలగొచ్చు. పైగా.. భారత ప్రభుత్వం నుంచి జట్టుకి పాక్‌కు వెళ్లేందుకు అనుమతి లభించే ఛాన్స్ కూడా లేదు. ఒకవేళ అదే జరిగితే.. భారత జట్టు స్థానంలో శ్రీలంక ఈ టోర్నీకి అర్హత సాధిస్తుంది. కాగా.. 2008లో జరిగిన ఆసియా కప్ తర్వాత భారత జట్టు పాకిస్తాన్‌లో ఆడలేదు. అప్పటి నుంచి ఈ ఇరుజట్లు కేవలం ఐసీసీ, ఏసీసీ ఈవెంట్‌లలోనే తలపడుతున్నాయి. 2023లో ఆసియా కప్ ఆతిథ్య హక్కులను పాక్ సొంతం చేసుకుంది కానీ, భారత జట్టుకి ఆ దాయాది దేశానికి వెళ్లేందుకు అనుమతి లభించలేదు. దీంతో.. మరో దారి లేక భారత మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించారు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ విషయంలోనూ అదే రిపీట్ కావొచ్చని అందరూ అనుకుంటున్నారు. భారత్‌తో జరిగే మ్యాచ్‌లు ఎంతో కీలకమైనవి కాబట్టి.. హైబ్రిడ్ పద్ధతికి పాక్ అంగీకరించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరి.. ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో చూడాలి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





# లెహంగా అందం అంతా రాశీఖన్నా మయం!

అందాల రాశీఖన్నా కాన్సంట్రేషన్ అంతా కోలీవుడ్..బాలీవుడ్ చిత్రాలపై పెట్టిన సంగతి తెలిసిందే. అమ్మడి నుంచి గత ఏడాది ఒక్క సినిమా కూడా రిలీజ్ కాలేదు. ఈ క్రమంలో ఖాళీగా ఉండి ఏం చేస్తుంది అనుకున్నారంతా. కానీ ఇలా షాకిచ్చిలా అవకాశాలు అందుకుని బిజీ అవుతుందని ఎవరూ అనుకుని ఉండరు. అవును రాశీకన్నా ఇప్పుడు రెండు భాషల్లోనూ కలిపి ఐదారు సినిమాలు చేస్తోంది. అందులో తెలుసు కదా అనే తెలుగు సినిమా ఒక్కటి ఉంది. మిగతా చిత్రాలన్ని పరభాషకు చెందినవే. %-%టీ ఎమ్ ఈ%-...-%ది సబర్మతి రిపోర్ట్%-% చిత్రాల షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం అవి పోస్ట్ ప్రొడక్షన్ లో ఉన్నాయి. సబర్మతి రిపోర్ట్ పై భారీ అంచనాలున్నాయి. గోద్రా రైలు దుర్ఘటనకు సంబంధించిన అంశం కావడంతో దేశ వ్యాప్తంగా ఆ సినిమా రిలీజ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈనెలలోనే రిలీజ్ అవ్వాలి కానీ అభ్యం తరాలు ఉండటంతో వాయిదా వేసారు. ఈ సినిమాపై రాశీఖన్నా చాలా ఆశలు పెట్టుకుంది. ఇలా నటిగా ఇంత బిజీగా ఉన్నా సోషల్ మీడియాలో హీటెక్కించే ఫోటోలు మాత్రం తగ్గలేదు. ఎప్పటికప్పుడు హాట్ ఫోటోలతో విరుచుకుపడుతోంది. అయితే ఈసారి అందుకు భిన్నంగా అందమైన లెహంగా దుస్తుల్లో మరింత అందంగా మ-నస్తాబై ఇలా దర్శన మించింది. వైట్ లెహంగా రాశీ అందాన్ని మరింత రెట్టింపు చేసింది. మెడలో డిజైనర్ హారం, చెవులకు పెట్టుకున్న రింగులు ప్రతీది రాశీని మరింత అందంగా తీర్చి దిద్దాయి. కళ్లకు ఐటెక్స్... నుదిటిన చిన్న బొట్టు సైతం పెట్టుకుని కొత్తగా ప్రజెట్ అయింది. లెహంగాలో రాశీ అలా కింద కూర్చుకుని కెమెరాకి ఫోజులిచ్చింది. లెహంగాని నేలపై అందంగా పరిచిన వైనం ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. రాశీని లెహంగాలో చూసి అభిమానులు వెర్రెత్తిపోతున్నారు.



# ఈ బ్యూటీ పని అయిపోయినట్లేనా..?

బాలీవుడ్ లో సీరియల్స్ లో నటించి ఆ క్రేజ్ తో సౌత్ లో ఛాన్స్ అందుకున్న హీరోయిన్స్ లిస్ట్ లో పాయల్ రాజ్ పుత్ కూడా ఉంది. అక్కడ సీరియల్స్ లో నటించిన ఆమెను చూసిన అజయ్ భూపతి %=ఠ% 100 లో తను రాసుకున్న హీరోయిన్ పాత్రకు పర్ఫెక్ట్ అనుకున్నాడు. వెంటనే ఆడిషన్ చేసి సెలెక్ట్ చేశాడు. కార్తికేయతో పాయల్ చేసిన %=ఠ% 100 సూపర్ హిట్ అయ్యింది. సినిమాలో పాత్రకు పాయల్ పర్ఫెక్ట్ మ్యాచ్ అనిపించింది. సినిమా హిట్ తో పాయల్ కు వరుస అవకాశాలు వచ్చాయి. ఐతే అన్ని కూడా %=ఠ% 100 తరహా కథలే వస్తున్నాయని అమ్మడు బాధపడింది. ఐతే ఎలాగోలా సినిమాలు చేస్తూ వచ్చిన అమ్మడికి వెంకటేష్, రవితేజ లాంటి స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్సులు వచ్చాయి. ఐతే ఆ సినిమాల ఫలితాలు తేడా కొట్టడంతో అమ్మడి కెరీర్ రిస్క్ లో పడింది. లాస్ట్ ఇయర్ మాయా పేటిక సినిమాతో వచ్చిన పాయల్ ఆ తర్వాత ఆరెక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతి చేసిన మంగళవారం లో కూడా నటించింది. మంగళవారం కమర్షియల్ గా ఒక రేంజ్ లో ఆడకపోయినా పాయల్ కి మళ్లీ కొంత బూస్టింగ్ ఇస్తుందని అనుకున్నారు. ఆ సినిమాలో పాయల్ తన నటనతో ఆకట్టుకుంది. తనలో ఉన్న టాలెంట్ ని కేవలం అజయ్ భూపతి మాత్రమే చూడగలుగుతున్నాడు అన్నట్టుగా మంగళవారం లో అమ్మడి యాక్టింగ్ ఉంది. ఐతే ఆ సినిమా తర్వాత అయినా పాయల్ ఫేట్ మారుతుందని అనుకోగా తెలుగులో మళ్లీ అదే సీన్ రిపీట్ అవుతుంది. ఐతే ఇలా కాదనుకున్న పాయల్ చిన్నగా కోలీవుడ్ బాట పట్టింది. అక్కడ గోల్ మాల్, ఏంజెల్ సినిమాల్లో నటించింది. పాయల్ నుంచి ఈమధ్యనే తెలుగులో వచ్చిన రక్షణ సినిమాను కూడా ఎవరు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆది సాయి కుమార్ తో ఒక సినిమా చేస్తుంది పాయల్. మరి ఆ సినిమా అయినా అమ్మడికి తెలుగులో మంచి బ్రేక్ ఇస్తుందేమో చూడాలి. ఎలాంటి పాత్ర ఇచ్చినా చేసేందుకు రెడీ అనేస్తున్న పాయల్ ని కేవలం గ్లామర్ సైడ్ మాత్రమే కాకుండా వెరైటీ రోల్స్ చేయిస్తే బెటర్ అని చెప్పొచ్చు. సినిమాల్లో కాకపోయినా అమ్మడు తన ఫోటో షూట్స్ తో ఆడియన్స్ కు కావాల్సినంత గ్లామర్ స్టఫ్ అందిస్తుంది. అందుకే ఒక్కసారి పాయల్ ని ఫాలో అవ్వడం మొదలు పెడితే అమ్మడి మాయలో తడిసి ముద్ద అవ్వాల్సిందే అని చెప్పుకుంటున్నారు ఆడియన్స్.

# అందుకే ఇంత టైమ్ తీసుకున్నా

'ఇందులో నాది చాలెంజింగ్ రోల్. ఇప్పటివరకూ ఇలాంటి పాత్ర చేయలేదు. స్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ ఉన్న అమ్మాయిగా ఇందులో కనిపిస్తా. దర్శకుడు అశ్విన్‌రామ్ కథ చెప్పినప్పుడు ఎక్సయిటింగ్ అనిపించింది. ఇలాంటి విభిన్నమైన పాత్ర దొరకడం నా అదృష్టం.' అంటూ అందాలభామ నభానటేష్ ఆనందం వెలిబుచ్చింది. ప్రియదర్శికి జోడీగా ఆమె నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్‌రామ్ దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మాతలు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నభా శనివారం విలేకరులతో ముచ్చటించింది. 'యాక్సిడెంట్ వల్ల భుజానికి గాయమై రెండేళ్లుగా సినిమాలు చేయలేకపోయా. ఆడియన్స్‌కి నా ఎనర్జీ ఇష్టం. మళ్లీ మునుపటి ఎనర్జీతోనే రావాలని ఇంత టైమ్ తీసుకున్నా. సరైన సినిమాతో కమ్‌బ్యాక్ అవుతున్నందుకు ఆనందంగా ఉంది. 'డార్లింగ్'లో ఫన్‌తో పాటు ప్రేమ, కుటుంబ ఉద్వేగాలు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఇలా అన్నీ ఉంటాయి.' అని తెలిపింది నభా నటేశ్. 'ఇందులో రెండు డిఫరెంట్ రోల్స్ చేయాలి. అందుకోసం చాలా హెూంవర్క్ చేశా. స్లిట్ పర్సనాలిటీ సినిమాలు చాలా చూశా. ఆ కష్టం రేపు స్క్రీన్‌పై చూస్తారు. ప్రియదర్శితో కలిసి నటించడం చాలా బావుంది. మా కెమిస్ట్రీ అద్భుతంగా పడింది. నా యాక్షన్‌కి ప్రియదర్శి రియాక్షన్ సూపర్. తన కామెడీ టైమింగ్ నాచురల్‌గా ఉంటుంది. అలాగే, దర్శకుడు ఈ కథను మలిచిన తీరు, నిర్మాతల రాజీలేని తనం. వివేక్‌సాగర్ మ్యూజిక్.. ఇవన్నీ ఈ సినిమాకు ఎస్సెట్స్.' అని నభానటేశ్ పేర్కొన్నది.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986